నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నిజామాబాద్-కామారెడ్డి
బుధవారం | మార్చి 05, 2025 | www.navatelangana.com

5 నిమిషాలు ఆలస్యంగా వచ్చినా అనుమతి

- నేటి నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లా వ్యాప్తంగా నేటి నుంచి ఇంటర్ వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. కాగా ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చినా పరీక్ష కేంద్రంలోకి అనుమతి ఇస్తున్నట్టు అధికారులు తెలిపారు. నేడు తొలిరోజు ఇంటర్ మొదటి సంవత్సరంలో ఫస్ట్ లాంగ్వేజ్ పరీక్ష తెలుగు నిర్వహించనున్నారు. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 36,222 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారు . ఇందుకోసం 57 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతి సెంటర్ సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేశామని, సెంటర్ పరిధిలో 144 సెక్షన్ అమల్లో ఉన్నట్టు డీఐఈవో తెలిపారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు ఉంటాయని, ఉదయం 8 గంటల వరకు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని 8.45 నుంచి పరీక్ష కేంద్రంలోకి అనుమతించనున్నట్టు తెలిపారు.

పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సంబరాలు

నవతెలంగాణ-బాల్కొండ



బాల్కొండ మండల కేంద్రంలోని మదర్ తెరిసా హైస్కూల్లో మంగళవారం 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభ వైభవంగా అహ్లాదకరంగా నిర్వహించారు. ఈ వీడ్కోలు సంబరాలను కరస్పాండెంట్ కె రామలక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాఠశాల తమ అనుభవాలను పంచుకున్నారు. అనంతరం శ్రీ వెంకటేశ్వర మదర్ తెరిసా హైస్కూల్ విద్యార్థులు ఆటపాటలతో, సాంస్కృతిక నృత్యాలతో వీడ్కోలు సభను కనుల విందు చేశారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్ లు సుబ్బారెడ్డి, నరసింహారెడ్డి రిటైర్డ్ ఎన్సిసి ఆఫీసర్ బిఆర్ నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో అశోక్

భయాందోళనలు వీడి
ఉత్తమ ఫలితాలు సాధించాలి

- విజయస్ఫూర్తిలో జిల్లా విద్యాధికారి అశోక్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

10వ తరగతి విద్యార్థులు అందరూ పరీక్షల పట్ల భయాందోళనలు వీడి పరీక్షలకు సన్నద్ధమై మంచి ఉన్నతమైన ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాధికారి అశోక్ అన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మండలంలోని అన్ని పాఠశాలల పదవ తరగతి విద్యార్థులకు విజయ స్ఫూర్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జక్రాన్‌పల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు లింగన్న అధ్యక్షత వహించగా డీఈవో ముఖ్య అతిథిగా వచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. 10వ తరగతి విద్యార్థులకు ఈ సమయం చాలా ముఖ్యమైనదని, గత కొన్ని రోజుల నుండి ఉదయం, సాయంకాలము ప్రత్యేక తరగతులను బోధిస్తూ విద్యార్థులకు ప్రిపరేటరీ పరీక్షలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అదేవిధంగా ప్రీ ఫైనల్ ఎగ్జామ్ కూడా నిర్వహించడం జరుగుతుంది. కావున విద్యార్థులందరూ పరీక్షల పట్ల భయాందోళనలు వీడి పరీక్షలకు చక్కగా సన్నద్ధమై మంచి ఉన్నతమైన ఉన్నతమైన ఫలితాలను సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఎం శ్రీనివాస్, పడకల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సురేందర్ రెడ్డి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు 480 మంది పదవ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మోటివేటర్ స్పీకర్గా మహేష్ పాల్గొని విద్యార్థుల భయాందోళన తొలగించి పరీక్షలకు సన్నద్ధం చేశారు. విషయ నిపుణులుగా కాసర్ల నరేష్, రాజు నారాయణ, అరవింద్ , గోపాలకృష్ణ, ముద్దుకృష్ణ, స్రవంతి, రవీందర్ హాజరై విద్యార్థులకు పలు సూచనలు అందజేశారు.

వీడని ఉత్కంఠ

- కొనసాగుతున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్
- తొలిరౌండ్ నుంచి ఆధిక్యతలో బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి
- పోటీనిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్ డెస్క్



నరేందర్‌రెడ్డి (కాంగ్రెస్) అంజిరెడ్డి(బీజేపీ) ప్రసన్న హరికృష్ణ(బీఎస్పీ)



ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ ఉత్కంఠ నడుమ కొనసాగు తుంది. కాంగ్రెస్ నుంచి బరిలో ఉన్న నరేందర్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి, బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ మధ్య పోటీ నెలకొంది. కాగా బీజేపీ అభ్యర్థి ప్రతి రౌండ్‌లో అధికృత ప్రదర్శిస్తున్నారు.



కరీంనగర్ జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలోని ఇండోర్‌లో లెక్కింపు కొనసాగుతోంది. సోమవారం లెక్కింపు ప్రారంభం కాగా.. టీచర్ ఎమ్మెల్సీ ఎన్నిక ఫలితం వచ్చిన విషయం విధితమే. అయితే గ్రాడ్యుయేట్ ఓట్ల లెక్కింపు మంగళవారం మధ్యాహ్నం తర్వాత కొలిక్కి వచ్చింది. గ్రాడ్యూయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్లకు సంబంధించి 499 బ్యాలెట్ బ్యాక్సులకుగాను 21 టేబుళ ఏర్పాటు చేసి ఓట్లు లెక్కిస్తున్నారు. మొత్తం 3,55,159 ఓటర్లకు గాను 2,50,106 ఓట్లు పోలయ్యాయి. 21 రౌండ్‌లలో లెక్కింపు కొనసాగుతోంది. ఒక్కో రౌండ్‌కు 21 వేల ఓట్లను లెక్కించనుండగా, 21 టేబుళ్లల్లో టెబుల్‌కు వెయ్యి చొప్పున ఓట్లను లెక్కిస్తున్నారు.

అధికృతలో బీజేపీ అభ్యర్థి

గ్రాడ్యుయేట్ ఎన్నికలకు సంబంధించి మంగళశారం మధ్యాహ్నం తర్వాత తొలిరౌండ్ వివరాలు ఎన్నికల అధికారులు వెల్లడించారు. తొలిరౌండ్‌లో ప్రధానంగా బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి 6712 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి 6676 ఓట్లు, బీఎస్పీ ప్రసన్న హరికృష్ణ 5867 ఓట్లు సాధించారు. బీజేపీ అభ్యర్థి 36 ఓట్ల ఆధిక్యం సాధించారు. కాగా రెండో, మూడో రౌండ్‌లో సైతం అధిక్యం కనబరిచారు. మూడు రౌండ్‌లు ముగిసే సరికి అంజిరెడ్డి 4494 ఓట్ల ఆధిక్యంలో ఉన్నారు.

ముగ్గురి మధ్యే పోటీ

తొలినుంచి భావించినట్టు మూడు ప్రధాన పార్టీల అభ్యర్థుల నడుమే పోటీ నెలకొంది. నాలుగు రౌండ్‌లు ముగిసే సరికి బీజేపీ అభ్యర్థి 31,117, కాంగ్రెస్ 25,356, బీఎస్పీ 21,151 ఓట్లు సాధించారు. అంజిరెడ్డి 5761 ఓట్ల అధిక్యంలో నిలిచారు. మొత్తం 2,24,000 ఓట్లకు గాను నాలుగు రౌండ్‌లు పూర్తయ్యే వరకు సుమారు 84,000 ఓట్ల లెక్కింపు పూర్తి అయింది. ఇంకా 17 రౌండ్‌ల లెక్కింపు కొనసాగుతోంది.

ప్రధాన పార్టీల అభ్యర్థులకు రౌండ్ వారీగా వచ్చిన ఓట్లు

	కాంగ్రెస్	బీజేపీ	బీఎస్పీ
1వ	6676	6712	5867
2వ	6522	7979	4927
3వ	5614	8619	5086
4వ	6544	7807	5271

భోజనం వేడివేడిగా వడ్డించాలి

- బాలికల గురుకులాన్ని సందర్శించిన కలెక్టర్



గురుకులంలో కిచెన్ పరిశీలించి మాట్లాడుతున్న కలెక్టర్

నవతెలంగాణ-మెండోరా

విద్యార్థులకు భోజనం వేడివేడిగా వడ్డించాలని, కిచెన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేట్టు చూసుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. పోచంపాడ్‌లోని సోషల్ వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సాంఘిక సంక్షేమ పాఠశాలలో కిచెన్ , స్టోర్ రూం, డార్మెంటరీ, డైనింగ్ హాల్‌లను సందర్శించి మెనూ, బియ్యం , కూరగాయలు , పప్పు దినుసులు, వంట నూనె, ఇతర సరుకుల నాణ్యతను పరిశీలించారు. సరుకుల స్టాక్ రిజిష్టర్‌ను తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణను పరిశీలించి ప్లే గ్రౌండ్ గురించి ఆరా తీశారు. అర్ధాంతరంగా నిలిచిపోయిన ల్యాబ్ గదుల నిర్మాణాలను పూర్తి చేయించేందుకు తక్షణమే ప్రతిపాదనలు పంపాలని నిర్వాహకులను ఆదేశించారు. కిచెన్ లో నిరుపయోగంగా ఉన్న స్టీమ్ యూనిట్ ను వినియోగంలోకి తేవాలని విద్యార్థినులకు అన్నం , ఇతర ఆహార పదార్థాలు శుద్ధి చేసి పరిశుభ్రంగా వంటలు చేయడానికి ఉపయోగపడుతుందని అన్నారు.

అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోగులకు అందిస్తున్న వైద్య సేవల తీరును గమనించారు. అందుబాటులో ఉన్న మందుల స్టాక్ రిజిస్టర్‌ను , వైద్యులు , వైద్య సిబ్బంది హాజరు పట్టికను తనిఖీ చేశారు. వివిధ వార్డులను సందర్శించి రోగులకు కల్పిస్తున్న సదుపాయాలను పరిశీలించారు. రక్తం పరీక్షలు నిర్వహించి మధుమేహం, టైఫాయిడ్ , మలేరియా వంటి వ్యాధుల నిర్ధారణ , వాటి బారిన పడిన వారికి అందిస్తున్న చికిత్సల గురించి అడిగి తెలుసు కున్నారు. అన్ని రకాల ఔషధాలు అందుబాటులో ఉండేలా చూసుకో వాలని వైద్యాధికారులకు సూచించారు. ఆయన వెంట సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల ఇంచార్జ్ జోనల్ ఆఫీసర్ పూర్ణచందర్ , పాఠశాల ప్రిన్సిపాల్, మెడికల్ అధికారి డాక్టర్ రాకేశ్ , తహసిల్దార్ తదతరులు ఉన్నారు.

పరీక్షల పట్ల భయం వీడాలి



మాట్లాడుతున్న జిల్లా జడ్జీ సునీత కుంచాల

- విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయాలి
- జిల్లా జడ్జి కుంచాల సునీత
- దాతల సాయంతో బాలికల గురుకులంలో సానిటరీ నాప్‌కిన్ వెండింగ్ మిషన్ అందజేత
- దాతల సాయంతో 9 గురుకులాల్లో అందజేస్తున్నట్టు వెల్లడి

నవతెలంగాణ-ఎడపల్లి

పది, ఇంటర్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థినులు.. పరీక్షల పట్ల భయం వీడాలని, అధైర్యపడొద్దని జిల్లా జడ్జీ కుంచాల సునీత సూచించారు. ఉపాధ్యాయులు చెప్పిన బోధనాంశాలను చక్కగా విని చదువు పైన ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి ఒక్క విద్యార్థి 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. ఎడపల్లి మండల పరిధిలో గల తెలంగాణ గురుకుల బాలికల పాఠశాల కళాశాలలో మంగళవారం సానిటరీ నాప్‌కిన్ వెండింగ్ మిషన్ అందజేశారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 9 గురుకులాల్లో బాలికల కోసం దాతలు సరోజమ్మతో పాటు జిల్లా జడ్జి కుంచాల సునీత, ఇతర అధికారుల సహకారంతో సానిటరీ నాప్‌కిన్ వెండింగ్ మిషిన్‌లను అందజేశారు.

ఈ సందర్భంగా జిల్లా జడ్జి కుంచాల సునీత మాట్లాడుతూ బాలికల్లో ఉన్న దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఉపాధ్యాయుల కృషి ఎంతో అవసరమని అన్నారు. 18 సంవత్సరాల లోపు ఉన్న బాల బాలికలు ద్విచక్ర వాహనాలను నడపకూడదన్నారు. అలా నడిపితే పోలీసులు చర్యలు తీసుకుంటారని తెలిపారు. అలాగే బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలను ఎదుర్కొనేందుకు బాలికలు చదువుతోపాటు, యోగా, ఆత్మ రక్షణ కోసం కరాటే శిక్షణ కూడా తీసుకోవాలని సూచించారు.

అనంతరం విశ్రాంత ఉపాధ్యాయులు సరోజమ్మను న్యాయవాదులతో పాటు, స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బోధన్ శివ సాయి, న్యాయవాదులు, గురుకుల పాఠశాల కళాశాల ప్రధాన చార్యులు గంగా శంకర్, బోధన్ రూరల్ పోలీస్ అధికారి విజయ్ బాబు, ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణారెడ్డి, స్థానిక పాఠశాల కళాశాల, ఉపాధ్యాయులు, పాఠశాల బాలికలు తదితరులు పాల్గొన్నారు.

నిలువనీడ కరువు

- జుక్కల్ చౌరస్తాలో ఎండలోనే బస్సుల కోసం ప్రయాణికుల పడిగాపులు



చౌరస్తా వద్ద ఎండలో నిల్చున్న ప్రయాణికులు



ఆటో నీడలో సేదదీరుతున్న వృద్ధురాలు

నవతెలంగాణ-జుక్కల్

జుక్కల్ చౌరస్తా నేషనల్ హైవే వద్ద ఉన్న బస్టాండ్ ప్రాంతంలో నిలువు నీడ లేక ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. నేషనల్ హైవే 161 పైన హైదరాబాద్ వెళ్లేందుకు హైవే ఆథారిటీ నిర్మించిన బస్టాండు నిర్మించినప్పటికీ అది నిరుపయోగంగా ఉంది. ప్రయాణకులకు నిలబడేందుకు కొద్దిపాటి దూరంగా ఉండడంతో అక్కడికి వెళ్లి నిలబడడానికి సంకోచిస్తున్నారు. అదేవిధంగా చౌరస్తా నుండి జుక్కల్ వెళ్లేందుకు హైదరాబాద్ , నిజామాబాద్ , కామారెడ్డి , కరీంనగర్ నుంచి వస్తూ పోతూ ఉంటారు. ప్రయాణికులు భారీగా చౌరస్తా వద్ద గుమ్మిగూడుతున్నారు.

గతంలో రూర్బన్ పథకంలో జుక్కల్ మండలానికి కేంద్ర నిధులు 180 కోట్లు మంజూరు చేశారు. నాటి ప్రభుత్వం మంజూరు చేసిన డబ్బులతో మండలంలో 15 ప్రయాణ ప్రాంగణాలు నిర్మాణం చేశారు. కొన్ని అందుబాటులో ఉపయోగం లో ఉన్నప్పటికీ , ఇంకొన్ని వాటి ఉపయోగం లేక నిరుపయోగంగా ఉన్నాయి . వాటి అవసరం ఉన్నచోట నిర్మించకపోవడం , అవసరం లేని చోట నిర్మించడం ఇలా చేసి ప్రజాధనాన్ని వృధా చేశారని ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం ఎండలు తీవ్ర రూపం దాల్చాయి. కాగా జుక్కల్ , హనేగావ్ , బీదర్ , ఔరాద్ , పెద్దగుల్లా మూడు రాష్ట్రాలను కలయిక చేసి ప్రాంతాలైన ఏరియా ఇక్కడే ఉండడంతో అక్కడి నుండి ప్రయాణికులు భారీగా తెలంగాణకు వివిధ పనుల నిమిత్తం వస్తూపోతూ ఉంటారు. అధికారులు స్పందించి ప్రయాణికులకు నీడ సౌకర్యం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.



లోకల్ వాహనాలకు టోల్ మినహాయింపు ఇవ్వాలి

- టోల్‌ప్లాజావద్ద రామేశ్వర్‌పల్లి వాసుల నిరసన



మాట్లాడుతున్న గ్రామస్తులు

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ మండలంలో ఉన్న లోకల్ వాహనాలకు మినహాయింపు ఇవ్వాలని రామేశ్వర్ పల్లి గ్రామస్తులు డిమాండ్ చేశారు. మంగళవారం భిక్కనూర్ టోల్ ప్లాజా వద్ద మేనేజర్ ప్రకాష్‌కు వినతిపత్రం అందజేశారు. గత కొన్ని రోజులుగా లోకల్ వాహనాలకు టోల్ ప్లాజాలో ఫాస్ట్ స్టాగ్ చార్జీలు పడుతున్న కారణంగా రామేశ్వర్ పల్లి గ్రామస్తులు టోల్ ప్లాజా యాజమాన్యంతో వాగ్వాదానికి దిగారు. గ్రామస్తులు ప్రతిరోజు తమ కారులలో వ్యవసాయ బావుల వద్దకు వెళ్తూ వస్తుంటారని లోకల్ వారికి కూడా టోల్ ప్లాజా చార్జీలు వసూలు చేయడం సరి కాదన్నారు. అనంతరం టోల్ ప్లాజా యాజమాన్యం స్పందిస్తూ సొంత కారు కలిగి ఉన్నవారు ఆర్ సి, ఆధార్ కార్డు తీసుకువచ్చి అందజేస్తే కాంట్రాక్టర్‌కు తెలియజేసి మినహాయింపు విషయంలో చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. ఏది ఏమైనప్పటికీ నిత్యం టోల్ ప్లాజా వద్ద లోకల్ వాహనాలకు ఫాస్ట్ స్టాగ్ చార్జీలు బాధడంతో నిరసనలు వ్యక్తమవుతూనే ఉన్నాయి. ఈ కార్యక్రమంలో న్యాయవాది రాజబాబు గౌడ్, రామేశ్వర్ పల్లి అఖిలపక్ష నాయకులు భూమ్ రెడ్డి, చంద్రారెడ్డి, రవీందర్ రెడ్డి, లింగారెడ్డి, గ్రామస్తులు, రైతులు, తదితరులు ఉన్నారు.

వేతనాలు ఇవ్వమంటే అరెస్టులా..?

- అంగన్‌వాడీల అక్రమ అరెస్టులను ఖండించండి
- అరెస్టు చేసిన వారిని బేషరతుగా విడుదల చేయాలి
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న నూర్జహాన్

గత 11 నెలలుగా పెండింగ్‌లో ఉన్న మినీ అంగవాడీల ఏరియాస్ వేతనాలను విడుదల చేయాలని, పెరిగిన వేతనాలను వెంటనే అమలు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేసేందుకు వచ్చిన అంగన్‌వాడీల అక్రమ అరెస్టులను ఖండించాలని సిఐటియు కార్యదర్శి నూర్జహాన్ అన్నారు. జిల్లా కేంద్రంలో యూనియన్ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రజాదర్బార్ హైదరాబాదు లోని ప్రజావాణిలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మంగళవారం రోజు వినతి పత్రం ఇవ్వడానికి బయలుదేరుతున్న మినీ అంగన్‌వాడీలను ప్రభుత్వం పోలీసుల చేత అక్రమ అరెస్టు పాల్పడుతోందని అన్నారు. మినీ అంగన్వాడీలతో పాటు మెయిన్ అంగన్‌వాడీలను కూడా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్నారని హౌస్ అరెస్టులు చేస్తూ , అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్నారని అన్నారు. అంగన్‌వాడీలపైన నిర్బంధ కాండను ఆపాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం నిరం కుశ నిర్బంధ పాలనకు తెరలేపిస్తోందన్నారు. ప్రజా పాలన అంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంగన్వాడీలను అరెస్టులు చేయడం ఏంటని ప్రశ్నిం చారు. అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలి తప్ప ఆరెస్టులు చేసి పోలీస్ స్టేషన్లలో పెట్టడం, నిర్బంధాన్ని ప్రయోగించడం చేయడం వల్ల సమస్య పరిష్కారం కాదన్నా సంగతి ప్రభుత్వము గ్రహించాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా అరెస్ట్ అయినా సీఐటీయూ నాయకులను, అంగన్ వాడీలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకర్ గౌడ్, సిఐటియు జిల్లా కోశాధికారి స్వర్ణ జంగం గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక

- అధ్యక్షులుగా మాచారెడ్డి ఎంపీడీవో గోపిబాబు ఎన్నిక

నవతెలంగాణ-కామారెడ్డి



ఎంపీడీవో సంఘం జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కామారెడ్డిలోని జిల్లా పరిషత్ కార్యాలయం లో మంగళవారం జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి, జిల్లా పరిషత్ ఎన్నికల అధికారి బి చందర్ నాయక్ ఆధ్వర్యంలో 2025- 2027 సంవత్సరానికి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మాచారెడ్డి మండల ఎంపీడీవో టీపీఎస్ గోపి బాబు, ప్రధాన కార్యదర్శిగా ఎం సంతోష్ కుమార్ ఎంపీడీవో సదాశినగర్ , కోశాధికారిగా శ్రీ ఎల్ రాజేశ్వర్ ఎంపీడీవో గాంధారి,ఉపాధ్యక్షులుగా రాణి ఎంపీడీవో మద్నూర్, జాయింట్ సెక్రటరీగా కమలాకర్ ఎంపీడీవో పిట్లం, ఎగ్జిక్యూటివ్ మెంబర్ లు గా సయ్యద్ సాజిద్ అలీ, ఎంపీడీవో తాడ్వాయి, నాగవర్ధన్ ఎంపీడీవో కామారెడ్డి, శ్రీనివాస్ ఎంపీడీవో జుక్కల్ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరికి చంద్రనాయక్ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

మద్దతుధరతో సన్‌ఫ్లవర్, శనగ కొనుగోలు

- త్వరలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

నవతెలంగాణ-కామారెడ్డి

మద్దతు ధరతో సన్‌ఫ్లవర్, శనగ పంట కొనుగోలు చేయనున్నట్టు తెలంగాణ మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ (ఎఫ్ఎసి) డి. మహేష్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డి జిల్లాలో 1727 ఎకరాలలో సన్ ఫ్లవర్ పంట, 59,558 ఎకరాలలో శనగ పంట సాగైంది. దీనికి గాను ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నాఫెడ్ తరఫున రైతులకు మద్దతు ధర సన్ ఫ్లవర్ క్వింటాల్ కు రూ. 7280, శనగ క్వింటాల్ కు రూ. 5560 అందజేయనున్నట్టు తెలిపారు. త్వరలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నట్టు తెలిపారు. మద్నూర్, జుక్కల్, బిచ్కుంద, డొంగ్లీలో సన్‌ఫ్లవర్(పొద్దుతిరుగుడు) కొనుగోలు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. అదే విధంగా మద్నూర్, జుక్కల్, బిచ్కుంద, డొంగ్లీ, తాడ్వాయి, గాంధారి మండలాల్లో శనగ పంట కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కావున రైతులు గమనించి తమ సన్ ఫ్లవర్ పంటను 9 శాతం తేమ ఉండేటట్లు, శనగ పంటను 14 శాతం తేమ ఉండేటట్లు ఎండబెట్టి సకాలంలో అమ్ముకొని ప్రభుత్వ మద్దతు ధర పొందగలని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.

నవతెలంగాణ

2

నిజామాబాద్

బుధవారం | మార్చి 05, 2025 | www.navatelangana.com

ఆడపిల్లల చదువు దేశ అభివృద్ధికి మూలం



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని టీచర్స్ కాలనీ అంగన్వాడి కేంద్రంలో మంగళవారం భేటీ బచావో, భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా చిన్నారుల తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించినట్టు అంగన్వాడి సూపర్వైజర్ వెంకటరమణమ్మ తెలిపారు. జిల్లా కేంద్రం నుండి విచ్చేసిన జెండర్ స్పెషలిస్టు సౌమ్య, ఫైనాన్షియల్ లిటరసీ పుష్ప, సోషల్ వర్కర్ బాబు మాట్లాడుతూ ఆడపిల్లల చదువు దేశ అభివృద్ధికి మూలం అని అన్నారు. నేడు మహిళలు అన్ని రంగాల్లో దూసుకెళ్తున్నారని తెలిపారు. ప్రతి అంగన్వాడి కేంద్రంలో పిల్లలందరికీ ప్రతినెల క్రమం తప్పకుండా బరువు, ఎత్తు చూస్తూ పోషకాహారంపై సైతం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు సూపర్వైజర్ తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడి టీచర్, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన ఎంపీడీవో



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రం శివారులోని గాంధీనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ మంగళవారం సందర్శించారు. ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్, వారి పనితీరును పరిశీలించారు. తరగతి గదులను సందర్శించిన ఆయన విద్యార్థులతో ముచ్చటించారు. పాఠశాలలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. వంటగదిని పరిశీలించిన ఆయన పరిశుభ్రమైన వాతావరణంలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని తయారు చేయాలని మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పౌష్టికాహారంతో కూడిన నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించాలన్నారు. ఆయన వెంట ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

మామిడిపల్లి రైల్వే బ్రిడ్జిపై రాకపోకలు ప్రారంభం



నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి వద్ద ఏర్పాటు చేసిన రైల్వే బ్రిడ్జిపై మంగళవారం రాకపోకలు ప్రారంభమయ్యాయి. బ్రిడ్జి పనులు పూర్తి కావడంతో రాకపోకలు ప్రారంభమైనట్లు స్థానికులు తెలిపారు. బ్రిడ్జి తమకు అందుబాటులోకి వచ్చినందుకు ఆనందంగా ఉందని ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థినులకు కంటి వైద్య పరీక్షలు



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

నవతెలంగాణ-ముప్కాల్

జాతీయ అంధత్వ నివారణ పథకం రాష్ట్రీయ బాల్ స్వస్థ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో విద్యార్థినులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం విద్యార్థినులకు కంటి చూపుపై పలు సూచనలను అందించారు. కార్యక్రమంలో కంటి వైద్యులు గురురాజు, డాక్టర్ సూర్యనారాయణ, ఏఎన్ఎం స్వరూప రాణి, ఎంఈవో రవికుమార్, పాఠశాల ఎస్వో జి.వినోద, పాఠశాల ఎఎన్ఎం మమత, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వానికి పోరాడుదాం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వంకై పోరాడుదామని, మహిళలపై హింసకు వ్యతిరేకంగా 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకుందామని ప్రగతిశీల మహిళా సంఘం(పిఓడబ్లు) జిల్లా అధ్యక్షురాలు ఆకుల అరుణ పిలుపు ఇచ్చారు. మంగళవారం ప్రగతిశీల మహిళా సంఘం (పిఓడబ్లు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని ద్వారక నగర్ కార్యాలయంలో సన్నహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకుల అరుణ మాట్లాడుతూ.. మహిళలపై హింసను వ్యతిరేకిద్దాం.. హైదరాబాదులో జరిగే 72వ ప్రపంచ అందాల పోటీలను అడ్డుకుందాం అన్న డిమాండ్లతో మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరపాలని రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిందని తెలిపారు. తమ శక్తికి మించి ఇంటా బయట పనిచేస్తున్న మహిళలకు ఆర్థిక, రాజకీయ, సమానత్వం అందడం లేదని, ఉత్పత్తిలో సగభాగమైన స్త్రీ ఇంకా వివక్షతకు గురి అవుతుందన్నారు. కులాంతర, మతాంతర వివాహాలు చేసుకున్న జంటలపై విచ్చలవిడిగా దాడులు జరుగుతున్నాయని, వాటిని అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. మహిళలపై జరిగిన దాడుల విషయంలో న్యాయస్థానాలు సైతం సరైన న్యాయాన్ని కల్పించ లేకపోతున్నాయని అక్రమార్కులను, నిందితులను శిక్షించకుండా వదిలేస్తున్నాయని తెలిపారు. 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నగరంలోని ద్వారక్ నగర్ కార్యాలయం నుంచి ర్యాలీ అనంతరం సభ నిర్వహిస్తామని ఇట్టి కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అనంతరం ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర నాయకురాలు, తెలంగాణ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ పిట్ల సరిత మాట్లాడుతూ.. స్త్రీని వ్యాపార వస్తువుగా చూపుతున్న 72వ ప్రపంచ అందాల పోటీలు హైదరాబాద్ నగరంలో ఎవరి ప్రయోజనాల కోసం నిర్వహిస్తున్నారని ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రభుత్వం మహిళా సాధికారత గురించి మాట్లాడుతూనే మరోవైపు అందాల పోటీలు నిర్వహించడం మూలంగా స్త్రీని వ్యాపార వస్తువుగా, అందంగా లేకపోతే మనిషే కాదు అనే విధంగా ప్రచారం నిర్వహిస్తుందన్నారు. భారత దేశంలో మహిళలంతా అణిచివేతకు గురవుతున్న పరిస్థితులలో అందాల పోటీలను భారతదేశంలో నిర్వహించడం అందులో హైదరాబాద్ నగరంలో నిర్వహించడం సరైందికాదని దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. దీనిని వెంటనే ప్రభుత్వాలు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల ప్రగతిశీల మహిళా సంఘం (పిఓడబ్లు) ఆధ్వర్యంలో ప్రపంచ అందాల పోటీలను అడ్డుకుంటామని తెలియజేశారు. ఈ సమావేశంలో ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భారతి, నగర అధ్యక్షురాలు నీలం లక్ష్మి, మహిళలు పాల్గొన్నారు.

కామ్రేడ్ బొజ్జ భూమాగౌడ్ 4వ వర్ధంతి



బొజ్జ భూమాగౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జిల్లా కార్యాలయంలో అమరులు కామ్రేడ్. బొజ్జ భూమాగౌడ్ 4వ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బుజ్జ భూమాగౌడ్ జిల్లాలో గీతా కార్మికుల సమస్యలపై పోరాటం నిర్వహించారని, నిజాంషుగర్ భూ పంపిణీ ఉద్యమంలో వర్ని మండలంలో పేదలకు ఇండ్ల స్థలాల పోరాటంలో పాల్గొని భూములు, ఇళ్ల స్థలాలు ఇప్పించినట్టు తన చివరి శ్వాస వరకు ప్రజా ఉద్యమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కే.భూమయ్య, సిపిఐ జిల్లా నాయకులు అడ్డికె.రాజేశ్వర్, వెంకటేశం గుప్తా, రాధాకుమార్, ఎస్.భాను చందర్, తదితరులు పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్డును కమ్మేసిన మొక్కలు

నవతెలంగాణ-మోర్తాడ్

జాతీయ రహదారి 63 సర్వీస్ రోడ్డుపై పిచ్చి మొక్కలు పెరిగి పాదచారులకు, ద్విచక్ర వాహనదారులకు ఇబ్బందిగా మారింది. పాదచారులు రహదారిపై వెళ్లకుండా పక్కన ఉన్న సర్వీస్ రోడ్ గుండా వెళ్లడానికి ఏర్పాటుచేసిన రహదారి పూర్తిగా కనిపించకుండా పిచ్చి మొక్కలుతో కమ్మేసింది. స్థానిక మండల కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు సుమారు 1కిలోమీటర్ వరకు పిచ్చి మొక్కలు మొలిచాయి. సంబంధిత అధికారులు వాటిని తొలగించకపోవడంతో రహదారిపై వెళ్లే పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. రహదారి మధ్య గుండా వెళ్లే సమయంలో భారీ వాహనాలు రావడంతో ప్రమాదాలకు నిలయంగా మారుతుందని, ఉన్నత అధికారులు తక్షణమే స్పందించి సర్వీస్ రోడ్డుపై ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని కోరుతున్నారు.



పరిశోధనలతోనే సమాజంలో విప్లవాత్మకమైన మార్పులు

- వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ యాదగిరిరావు



మాట్లాడుతున్న వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ యాదగిరిరావు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

విశ్వవిద్యాలయాల్లో క్షేత్రస్థాయి పరిశోధనలే సమాజంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొస్తాయని, యువత నూతన వినూత్న మార్పుల కనుగుణంగా పరిశోధనలు చేయాలని తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ యాదగిరి రావు అన్నారు. మంగళవారం తెలంగాణ యూనివర్సిటీ బిజినెస్ మేనేజ్మెంట్ విభాగం ఆధ్వర్యంలో పరిశోధన పత్రాల తయారీ అనే అంశంపై విభాగాధిపతి, కార్యశాల కన్వీనర్ ప్రొఫెసర్ సిహెచ్ ఆంజనేయులు అధ్యక్షతన ఒకరోజు కార్యశాలను నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి.యాదగిరిరావు పాల్గొని మాట్లాడుతూ.. యూనివర్సిటీల్లో విశ్వవిద్యాలయాలు పరిశోధనలకు కేంద్రంగా వర్ధిల్లుతాయన్నారు. ఆధునిక ప్రపంచంలో అద్భుతమైన మార్పులు విశ్వవిద్యాలయాల్లో జరిగిన పరిశోధనల వల్లనే సాధ్య మౌతాయన్నారు. అతిథిగా పాల్గొన్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.యాదగిరి మాట్లాడుతూ.. నూతన పరిశోధనలతో సవాళ్లను అధిగమించాలన్నారు. సామాజిక శాస్త్రాలలో సమాజమే ప్రయోగశాలగా భావించి పరిశోధనలు చేయాలన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ ప్రవీణ్ మామిడాల మాట్లాడుతూ.. చాట్ జిపిటి, గూగుల్, డీప్‌సీక్ లాంటివి మానవ పరిశోధనలకు సరికావన్నారు. కార్యక్రమంలో కన్వీనర్లు ప్రొఫెసర్ కైసర్ మహమ్మద్, ప్రొఫెసర్ అపర్ణ డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ వాణి, డాక్టర్ కిరణ్ రాథోడ్‌తో పాటు వివిధ కళాశాలల మేనేజ్మెంట్ విద్యార్థులు పాల్గొని ఉత్తమ పరిశోధన పత్రాల తయారీ పట్ల అవగాహన సంపాదించుకున్నారు.

బ్లాక్ మెయిల్ చేయడం సమంజసమా?

- ఆసుపత్రిపై నిందారోపణలు సరికాదు
- డాక్టర్ విష్ణు కుమార్



మాట్లాడుతున్న డాక్టర్ విష్ణు కుమార్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

కొందరు మీడియా పేరు చెప్పి బ్లాక్ మెయిల్ చేయడం ఎంతవరకు సమంజసమని, ఆసుపత్రిలో అన్ని సకల సౌకర్యాలు ఉన్నాయని, ల్యాబ్, మెడికల్ తదితర వాటికి సంబంధించిన సర్టిఫికెట్లు ఉంటేనే ఆసుపత్రి పెట్టడానికి అధికారులు అనుమతులు ఇచ్చారని, కొందరు వచ్చి సర్టిఫికెట్లు అడగడం దేనికని డాక్టర్ విష్ణుకుమార్, మేనేజ్మెంట్ మధు పేర్కొన్నారు. ఇందల్‌వాయి మండలకేంద్రంలోని తిర్మన్‌పల్లిలో ఉన్న ధరణిశ్రీ ఆసుపత్రిలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి జరిగిన ఘటనపై వివరించారు. గత నెల 26న ఇద్దరు యూట్యూబ్ ఛానల్ విలేకరులు ఆస్పత్రికి వచ్చి సిబ్బందిని డబ్బుల కోసం ఆసుపత్రి యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చి వేధించారని ధరణి ఆసుపత్రి డాక్టర్ విష్ణుకుమార్ తెలిపారు. వారం రోజులుగా ఇద్దరు అసుపత్రి చుట్టూ తిరుగుతూ ఆసుపత్రిలోకి వచ్చి వీడియోలు తీసి డబ్బులు ఇవ్వాలని, లేకపోతే ఉన్నతాధికారులకు చెప్పి ఆసుపత్రిని మూసివేయిస్తామని బెది రింపులకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వీడియోలు తీసి సర్టిఫికెట్ల గురించి అడిగారని, అన్ని అర్హతలు ఉంటేనే తెలంగాణ ప్రభుత్వ రిజిస్ట్రేషన్ నెంబర్ వచ్చిందని వివరించారు. ఏదో కొన్ని వీడియోలు తీసి బెదిరింపులకు గురిచేస్తూ డబ్బులు డిమాండ్ చేశారని ఆయన అన్నారు. తాము ఆసుపత్రి ఏర్పాటు చేసి రెండేళ్ళు అవుతుందని, వారు ఆస్పత్రిపై నిరాధారణమైన ఆరోపణలు చేయడం వల్ల ఆస్పత్రి పేరు డ్యామేజ్ అయ్యే ఆస్కారం ఉందని వాపోయారు. ఆసుత్రిలో ఏదైనా తప్పు జరిగితే అది చూపాలని, అలా కాకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలే గాని బ్లాక్మెయిల్ చేయడం దేనికని ప్రశ్నించారు. ఇదే విషయమై ఇద్దరు యూట్యూబ్ విలేకరులపై ఇందల్ వాయి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

రాణి అహిల్యాబాయి అసామాన్యమైన పాలకురాలు



మాట్లాడుతున్న కళాశాల ట్రెజరర్ అల్జాపూర్ గంగాధర్

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాలలో రాణి అహిల్యాబాయి హెూల్కర్ త్రిశతజయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ట్రెజరర్ అల్జాపూర్ గంగాధర్ మాట్లాడుతూ.. అహిల్యాబాయి వీరనారి, ప్రజాహితాన్ని కాంక్షించిన పరిపాలకురాలు అని, భారతదేశ చరిత్రలో అసామాన్యమైన పాలకురాలిగా గుర్తింపుపొందారని తెలిపారు. ఆమె ధర్మపాలన, ప్రజాసేవ, ఆలయాల నిర్మాణం సమర్ధ పరిపాలన ద్వారా గొప్ప చరిత్ర సృష్టించారని అన్నారు. ఆమె జీవిత గాథ ప్రతి విద్యార్థికి ప్రేరణగా నిలుస్తుందని తెలిపారు. "రాణి అహిల్యాబాయి పాలన ప్రజాస్వామిక విధానాలకు మూలస్తంభంగా నిలిచిందన్నారు. ఆమె గృహ నిర్మాణం, జల వనరుల అభివృద్ధి, విద్యా ప్రోత్సాహం వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలకు నాంది పలికారని తెలిపారు. విద్యార్థులు ఆమె జీవితం నుంచి క్రమశిక్షణ, త్యాగం, నాయకత్వ గుణాలను అలవరుచుకోవాలి" అని ఆకాంక్షించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అరుగుల సత్యం మాట్లాడుతూ, "రాణి అహిల్యాబాయి హెూల్కర్ అన్యాయానికి వ్యతిరేకంగా నిలిచారన్నారు. ముళ్ళపూడి హైమా మాట్లాడుతూ మహిళా సాధికారత అనేది కేవలం ఒక నినాదం కాదు, ఇది సమాజ మార్పుకు ఓ శక్తివంతమైన సాధనంఅని, ప్రతి మహిళకు సమాన అవకాశాలు, ఆత్మస్థైర్యం, స్వేచ్ఛ కల్పించగలిగినప్పుడు మాత్రమే నిజమైన అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. మహిళలు ఆర్థికంగా స్వయంప్రతిపత్తిని సాధించాలని, తమ హక్కులను తెలుసుకోవాలని, ప్రతి రంగంలో ముందుకు రావాలని అన్నారు. విద్యార్థులు రాణి అహిల్యాబాయి జీవితం, గొప్ప కార్యాలను ప్రదర్శించే పోస్టర్లను రూపొందించారు. విద్యార్థులు ఆమె జీవిత గాథను వివరిస్తూ ఉపన్యాసాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి

- ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు వినతి

నవతెలంగాణ-కంఠేశ్వర్

తనపై దాడి చేసిన గల్ఫ్ నకిలీ ఏజెంట్ కస్పా శ్యామ్, షకినం మధు, గుడ్ల ప్రకాష్, ఉప్పరి సాయి రెడ్డిపై అట్రాసిటీ కేసు నమోదు అయినా పోలీసులు పట్టించుకోవడం లేదంటూ బాధితుల ఆవేదన వ్యక్తం చేశారు. నిజామాబాద్ జిల్లా నందిపేట్ పోలీస్ స్టేషన్‌లో నకిలీ గల్ఫ్ ఏజెంట్ కస్పా శ్యామ్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు అయింది. ఆంధ్రప్రదేశ్ అమలాపురంకు చెందిన నరసింహ మూర్తిపై కస్పా శ్యామ్ సొంత గ్రామమైన నందిపేట మండలం ఐలాపూర్ గ్రామంలో తనను కులం పేరుతో దూషించి తనపై దాడి చేసినట్లు తెలిపారు. దాడి చేసిన కస్పా శ్యామ్, మధు, సాయి రెడ్డి, గుడ్ల దాసరి ప్రకాష్‌లపై పోలీస్ స్టేషన్ పిర్యాదు చేస్తే వారిపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. కేసు పురోగతి ముందుకెళ్లకుండా పోలీసులు నిర్లక్ష్యం వహిస్తున్నారని హైదరాబాదులోని ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు ఫిర్యాదు చేశారు. బాధితుడు నరసింహ మూర్తి ఈ విషయంపై సీరియస్‌గా తీసుకున్న చైర్మెన్ బక్కి వెంకటయ్య విచారణ చేస్తామని హామీ ఇచ్చారు. అయితే ఐలాపూర్ గ్రామానికి చెందిన కస్ప శ్యామ్ అనే ఏజెంటు తనను మోసం చేశారని, తన మనుషులను విదేశాలకు పంపిస్తానని డబ్బులు తీసుకొని మోసం చేశారని, దీనిపై అడగడానికి వెళ్లిన తనపై శ్యామ్ ఇంట్లో పిలిపించుకొని దాడి చేశారని అన్నారు. దీనిపై నందిపేట్ పోలీస్ స్టేషన్లో కేసు పెట్టిన పోలీసులు కేసు నమోదు చేశారు గాని ఎలాంటి చర్యలు చేపట్టలేదని నరసింహమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. తనను కులం పేరుతో దూషించి తన పై దాడి చేసిన కాస్ప శ్యామ్, షకినం మధు, గుడ్ల దాసరి ప్రకాష్, ఉప్పారి సాయి రెడ్డి పై చర్యలు తీసుకోవాలని బాధితుడు చైర్మెన్ ఎదుట వాపోయాడు. ఐతే గుడ్ల దాసరి ప్రకాశ్ తను వీడిసి మెంబర్‌నని, పద్మశాలి సంగం నాయకుడి నని, తను సంఘంలో తాను చెప్పిందే వేదం అని, తను రాసిన పేపర్ సంతకం పెట్టకుంటే గ్రామం దాటవని కచ్చితంగా సంతకం పెట్టాలని కులం పేరు తో దుషించారని వాపోయారు.

ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించిన కలెక్టర్



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లా కేంద్రంలోని వినాయకనగర్ లో గల ఈవీఎం గోడౌన్ ను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మంగళవారం అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోడౌన్ సీల్‌ను తెరిచారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్ లు, ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ కొనసాగిన మరమ్మతు పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. నాణ్యతతో పనులు జరిగేలా పర్యవేక్షణ చేయాలని పంచాయతీరాజ్ ఈఈ శంకర్‌ను ఆదేశించారు. సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించిన కలెక్టర్, అవి నిరంతరం పనిచేసేలా చూడాలన్నారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు, ఇతర సామాగ్రికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా గోడౌన్ లోనే పూర్తి స్థాయిలో సదుపాయాలు కలిగి ఉన్న గదుల్లో భద్రపర్చాలని, చెదలు నివారణ కోసం అవసరమైన చోట పెస్ట్ కంట్రోల్ చేయించాలని అధికారులను ఆదేశించారు. పనులను పక్కాగా జరిపించాలన్నారు. కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సిబ్బంది సాత్విక్, విజేందర్, అగ్నిమాపక శాఖ అధికారి నర్సింగ్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

డిజిటల్ స్కిల్స్‌పై అవగాహన



నవతెలంగాణ-ఆర్మూర్

డిజిటల్ ఈక్విటీ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెర్కిట్లో విద్యార్థులకు రోజువారి జీవితంలో అవసరమయ్యే డిజిటల్ స్కిల్స్‌పై అవగాహన కల్పించినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ఈమెయిల్ గూగుల్ షీట్స్ ఇంకా గూగుల్ స్లైడ్స్, గూగుల్ టూల్స్, గూగుల్ డాక్యుమెంట్ వివిధ రకాల స్కిల్స్ ఎలా వాడాలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు గూగుల్ స్లైడ్స్ ఉపయోగించి ప్రజెంటేషన్ చేశారు. ప్రధానోపాధ్యాయులతోపాటు డిజిటలైజ్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష

నవతెలంగాణ-ఆర్మూర్

పోలీస్ స్టేషన్ పరిధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన ఒకరికి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గట్టు గంగాధర్ రెండు రోజుల సాధారణ జైలు శిక్ష విధించినట్టు స్టేషన్ హౌస్ ఆఫీసర్ సత్యనారాయణ మంగళవారం తెలిపారు. పట్టణంలోని టీచర్స్ కాలనీ కి చెందిన దండోల దాసు కు సెకండ్ క్లాస్ మ్యాజిస్ట్రేట్ శిక్ష విధించినట్టు తెలిపారు.

వర్క్ ఫ్రం హెూం అంటూ మోసం

- పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఒకటవ పోలీస్ స్టేషన్ పరిధిలో వర్క్ ఫ్రం హెూం ఫ్రాడ్ ద్వారా ఓ యువతి మోసపోయినట్లు ఒకటవ పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ వో రఘుపతి మంగళవారం తెలిపారు. నిజామాబాద్ నగరంలోని రామ్ గోపాల్ స్ట్రీట్‌కు చెందిన గౌతమ్ గాంధీ వ్యాపారి, ఆయన తన భార్య ఫేస్‌బుక్‌లో రీల్స్ చూస్తుండగా వర్క్ ఫ్రం అనే యాడ్ చూసింది. గుర్తు తెలియని నంబర్ నుండి ఆమె వాట్సప్‌కు లింక్ పంపగా ఆమె తన బ్యాంక్ డీటెయిల్స్ పంపి తర్వాత రిజిస్ట్రేషన్ ఫీ గురించి మొత్తం నగదు 90,300 ఫోన్ పే ద్వారా గుర్తు తెలియని వ్యక్తికి పంపింది. మోసపోయినట్లుగా తెలుసుకొని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్హెచ్ఓ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తైక్వాండోలో గోల్డ్, సిల్వర్ మెడల్స్

- 27 గోల్డ్, 9 సిల్వర్, 2 బ్రాంజ్



మెడల్స్ సాధించిన క్రీడాకారులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో 27 గోల్డ్ మెడల్స్ 9 సిల్వర్ మెడల్స్, 2 బ్రాంజ్ మెడల్స్‌ను ఆమెచూర్ తైక్వాండో అసోసియేషన్ క్రీడాకారులు సాధించారు. తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో గ్రాండ్ మాస్టర్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో హైదరాబాద్ యూసుఫ్ గూడా కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో నిజామాబాద్ ఆమెచూర్ క్రీడాకారులు 27 గోల్డ్ మెడల్స్, 9 సిల్వర్ మెడల్స్, రెండు బ్రాంజ్ మోడల్స్ సాధించడం గర్వకారణమని నిజామాబాద్ జిల్లా తైక్వాండో అసోసియేషన్ చైర్మన్ బస్వా లక్ష్మీ నరసయ్య తెలియజేశారు పిల్లలు చదువుతోపాటు క్రీడల్లో కూడా ముందుంటే వాళ్ళ భవిష్యత్తు బాగుంటుందని ఆరోగ్యంగా ఉంటారని జాతీయస్థాయి అంతర్జాతీయ స్థాయిలలో కూడా మన రాష్ట్రాన్ని రిప్రజెంట్ చేయాలని కోరుతూ కోచ్ మనోజ్‌ని అభినందించారు. ఇందులో ప్రెసిడెన్సీ స్కూల్ మేనేజ్మెంట్ పవన్ కుమార్, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన వార్షికోత్సవం

నవతెలంగాణ-ముప్కాల్

మూడు రోజుల పాటు నిర్వహించిన 'శ్రీ లక్ష్మీ నరసింహస్వామి' ద్వితీయ వార్షికోత్సవం ఘనంగా ముగిసిన ట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ గడిచిన రెండు రోజులుగా స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేపట్టామన్నారు. చివరి రోజు మంగళవారం అభిషేకం, హెూమం చేసినట్టు చెప్పారు. భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వార్షికోత్సవాన్ని విజయవంతం చేయడంతో సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గురడి రెడ్డి సంఘం పెద్దలు, అర్చకులు వెంపటి గణేష్ కుమార్ శర్మ సోమనాథ్ పండితులు, తదితరులు పాల్గొన్నారు.

ఇస్రోజీవాడీ సందర్శన


మాట్లాడుతున్న ఎంపీడీవో నాగవర్ధన్

నవతెలంగాణ-కామారెడ్డి

ఇస్రోజీవాడి గ్రామాన్ని మండల ప్రత్యేక అధికారి, కామారెడ్డి ఎంపీడీవో నాగవర్ధన్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో వాటర్ ట్యాంక్, నర్సరీ, పల్లెప్రకృతి వనం, గ్రామంలోని శానిటేషన్ గురుంచి తెలుసుకొని వాటి అభివృద్ధిపై దృష్టి పెట్టనున్నట్టు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ లోకోటి సుదర్శన్ రావు, పంచాయతీ కార్యదర్శి దుబ్బాక కల్పన, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు పరిశీలన


కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని దూపల్లి గ్రామంలో ఎంపీడీవో వెంకటేష్ జాదవ్ ఉపాధి హామీ పనులను మంగళవారం పరిశీలించారు. ఉపాధి కూలీలకు పని కల్పిస్తూ, కూలీల సంఖ్యను పెంచాలని ఆయన క్షేత్ర సహాయకులు సాయిలును ఆదేశించారు. మంగళవారం 56 మంది కూలీలు మాత్రమే హాజరయ్యారు. కూలీల సంఖ్యను పెంచాలని ఆదేశించారు.

నేటి నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు

- పరీక్షలకు సర్వం సిద్ధం
- ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం

నవతెలంగాణ-కామారెడ్డి/నిజాంసాగర్

నేటితో ప్రారంభమవుతున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు జిల్లా అధికారులు పూర్తి ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే పరీక్షలకు సంబంధించిన ప్రశ్న పత్రాలు జిల్లాలోని వివిధ సెంటర్లకు సమీపంలో గల పోలీస్ స్టేషన్‌లకు చేరగా ఆయా పోలీస్ స్టేషన్‌లలో వాటిని భద్రపరిచారు. ప్రస్తుత సంవత్సరం పరీక్షలకు ఇంటర్మీడియట్ బోర్డ్ నిబంధనలు మార్చడంతో సిబ్బంది విద్యార్థులను అప్రమత్తం చేస్తున్నారు.

ఇంటర్మీడియట్ పరీక్షలకు సర్వం సిద్ధం..

కామారెడ్డి జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షల్లో మొత్తం 18,472 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఇందులో మొదటి సంవత్సరం విద్యార్థులు 8738 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 9729 మంది విద్యార్థులు హాజరుకానున్నారు వీరి కోసం 38 పరీక్ష కేంద్రాలను జిల్లా మొత్తంగా అధికారులు ఏర్పాటు చేశారు.

మారిన నిబంధనలు..



ఇంటర్మీడియట్ పరీక్షలకు ప్రస్తుత సంవత్సరం బోర్డు అనేక నిబంధనలు మార్చింది. వీటిపట్ల విద్యార్థులు జాగ్రత్త లేకుంటే ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి తలెత్తే అవకాశం ఉంది. గత సంవత్సరం ఒక్క నిమిషం ఆలస్యం నిబంధన ఉండగా, ప్రస్తుతం 15 నిమిషాలు ముందుకు అనగా 8:45 వరకు విద్యార్థులు లోనికి రావాలని నిబంధనలో తెలిపారు. అంటే ప్రతి విద్యార్థి 8:30 వరకు సెంట ర్‌కు చేరుకోవాలి. చేతి గడియారాలు లోనికి అనుమతించరు. సెంటర్లో సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేశారు. టైం కోసం ప్రతి అరగంటకోసారి బెల్లును కొడతారు.

హాల్ టికెట్లపై క్యూఆర్ కోడ్..

ప్రస్తుత సంవత్సరం ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షల హాల్ టికెట్ డౌన్లోడ్ కోసం ఫోన్ నెంబర్లకు లింకు పంపించిన ఇంటర్మీడియట్ అధికారులు, మరింత ముందుకు వెళ్లి వార్షిక పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లపై క్యూఆర్ కోడ్ పెట్టారు. దీని ద్వారా విద్యార్థికి పరీక్ష కేంద్రానికి సంబంధించిన వివరాలతో పాటు పరీక్ష కేంద్రం అడ్రస్ తెలపడానికి ఓ ప్రత్యేక ఫోన్ నెంబర్ కూడా తెలియనుంది. దీంతో విద్యార్థి సెంటర్‌కు సులువుగా చేరుకుని అవకాశం ఉండనున్నట్లు అధికారులు తెలిపారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం



నేటితో ప్రారంభమవుతున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు 15 నిమిషాలు ముందుగా విద్యార్థులు కేటాయించిన గదిలోకి వెళితే పరీక్ష పట్ల ఉన్న భయం పోతుందని ఉద్దేశంతో ఇంటర్మీడియట్ బోర్డ్ 15 నిమిషాల ముందుగా పరీక్ష కేంద్రంలోకి వెళ్లాలని నిబంధన విధించింది. దీని ద్వారా ఈ 15 నిమిషాలలో విద్యార్థులు ఓఎంఆర్ షీట్ నింపడం పనులు విద్యార్థులు చేసుకుంటారు. 9 గంటలకు ప్రారంభమైన పరీక్ష సజావుగా సాగుతుంది. విద్యార్థులు అందరూ కూడా అరగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి.

- ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం

ఇంటి పన్నులు వందశాతం పూర్తి చేయాలి

- ఎంపీవో రాము


పన్నులు వసూలు చేస్తున్న అధికారులు

నవతెలంగాణ-పిట్లం

పంచాయతీలలో గల ఇంటి పన్నుతో పాటు పలు వ్యాపార సంస్థల పన్నులను నెలాఖరులోపు వంద శాతం పూర్తిచేయాలని పంచాయతీ సెక్రెటరీలను ఎంపీఓ రాము ఆదేశించారు. మంగళవారం మండలంలోని జగదాంబ తండా గ్రామపంచాయతీ ఇంటి పన్నుల వసూళ్లను పరిశీలించారు. అలాగే ఉపాధి పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయా గ్రామ పంచాయతీల కుటుంబాలకు గాను మార్చ్ నెల ఇంటి పన్నుతోపాటు తదితర వ్యాపార సంస్థల పన్నులను పెండింగ్‌లో ఉన్న పన్నులన్నింటినీ ఆయా పంచాయతీలు నెలాఖరులోగా పూర్తిచేయాలని సూచించారు. అనంతరం పంచాయతీ పరిధిలో కొనసాగుతున్న ఉపాధి పనులను పర్యవేక్షించి ప్రభుత్వం సూచించిన కొలతల ప్రకారం పనులు నిర్వహించినట్లయితే అధిక డబ్బులు వస్తాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ శేఖర్, ఉపాధిహామీ టీఏ తుకారం పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

- కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ శోభారాణి


విద్యార్థులతో మాట్లాడుతున్న కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ శోభారాణి

నవతెలంగాణ-లింగంపేట్

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ శోభారాణి అన్నారు. మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు మంగళవారం వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు బాల్యం అనేది అమూల్యమైనదని, విద్యార్థులు క్రమశిక్షణతో ఉంటూ ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. విద్యార్థులు చదువుకోవడం వలన ఉద్యోగ అవకాశాలతో పాటు, సమాజంలో సత్ప్రవర్తనతో కలిగి ఉంటారని తెలిపారు. అనంతరం ఆటపాటలతో విద్యార్థులు అలరించారు. కార్యక్రమంలో సీఆర్పీ సత్యనారాయణ, ఉపాధ్యాయులు అపర్ణ, నిర్మల, విశాల, శైలజా, సరస్వతి, ప్రసన్న, సరిత, జ్యోతి, వరలక్ష్మి, సబితా, సుజాత, పుష్పలత విద్యార్థులు పాల్గొన్నారు.

గర్భిణులు జాగ్రత్తలు పాటించాలి

- మెడికల్ అధికారి దివ్య


ఆశాలతో మాట్లాడుతున్న మెడికల్ అధికారి దివ్య

నవతెలంగాణ-భిక్కనూర్

గర్భిణులు ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు పాటించాలని మెడికల్ అధికారి దివ్య తెలిపారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అమ్మ ఒడి కార్యక్రమంలో భాగంగా గర్భిణీ స్త్రీలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని, పౌష్టికాహారాన్ని తీసుకొని వైద్యుల సూచనలు సలహాల మేరకు మందులు వాడాలన్నారు. అనంతరం ఆశా డే సందర్భంగా మండల ఆశా సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి గర్భిణీ స్త్రీలు ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని, పీహెచ్సీలలో ప్రజలకు అందుబాటులో ఉండి చిన్నారులకు, బాలింతలకు టీకాలు, జాగ్రత్తలు తెలియజేయాలని మెడికల్ అధికారి సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఓ వెంకటరమణ, స్టాఫ్‌నర్స్, ఏఎన్ఎం, ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

భారతీయ కిసాన్ సంగ్ ఆధ్వర్యంలో జెండావిష్కరణ


జెండావిష్కరణలో పాల్గొన్న రైతులు

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద మంగళవారం భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో జెండాను రైతులు ఆవిష్కరించారు. భారతీయ కిసాన్ సంగ్ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులు, సంఘం సభ్యులు రైతు వేదిక వద్ద జెండాను ఆవిష్కరించి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా నాయకులు మాట్లాడుతూ.. రైతులకు రాజకీయం అవసరం లేదన్నారు. రైతు సమస్యలపై తాము నిరంతరం పోరాడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రాజాగౌడ్, పోశెట్టి, సాయిలు, రాజురెడ్డి, రాజాగౌడ్, నారాయణరెడ్డి, చందర్, రవి, తుపాతు రైతులు పాల్గొన్నారు.

మట్టిపాత్రల వాడకంపై ఆసక్తి

నవతెలంగాణ-పోతంగల్

మండల కేంద్రంలోని కుమ్మరిగల్లీలో చల్లని రాజస్థాన్ కుండలు, మట్టి బాటిల్స్, మట్టి జగ్గులు, టీ కప్పులు, మట్టి పెంకలు, మట్టి గ్లాసులను విక్రయిస్తున్నారు. మట్టిపాత్రలు ఆరోగ్యానికి మేలనేది మనకు తెలిసిందే. కానీ ప్రజలు ఎండాకాలం వచ్చిందంటే, తొందరగా చల్లబడే ఫ్రిజ్‌లపైనే మోజు చూపుతున్నారు. ఒకప్పుడు మానవులందరి జీవితం మట్టి పాత్రలతోనే ముడిపడి ఉండేది. కాలక్రమేణా జీవనశైలి మారింది. ప్లాస్టిక్, ఫైబర్, స్టీల్ లాంటి పాత్రల వాడకం పెరిగింది. ప్రస్తుతం ఎండలు ముదురుతున్నాయి. వేడి పెరిగేసరికి.. శరీరం చల్లటి నీరును కోరుకుంటుంది. త్వరగా చల్లబడే ఎలక్ట్రానిక్ ఉపకరణాలకు గిరాకీ పెరిగింది. వాటివల్ల అనారోగ్యం పాలవుతున్నా, మనుషులు వాటిని వదలడం లేదు. కుండలో నీరు వాడటం ఆరోగ్యానికి మంచిది. కుండలోని నీటిలో శరీరానికి అవసరమైన లవణాలు, ఖనిజాలు ఉండడమే కాక, ఆరోగ్యవంతులుగా ఉంటారని డాక్టర్లు, డైటీషియన్లు చెబుతున్నారు. మట్టిపాత్రలను వంటలు, పాలు, పెరుగు, నీరు, మజ్జిగకు వాడేవారు. కరోనా కాలం తరువాత, ఆరోగ్యం అవగాహనతో పాటు శ్రద్ధ పెరిగింది. అందువల్ల కొందరు నీరుతాగేందుకు మట్టికుండలను, మట్టి వాటర్ బాటిల్స్‌ను వాడుతున్నారు.



ఇందిరమ్మ మోడల్ హౌస్ పనులు పూర్తి చేయాలి

- రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ విక్టర్

నవతెలంగాణ-భిక్కనూర్

ఇందిరమ్మ మోడల్ హౌస్ పనులను త్వరగా పూర్తి చేయాలని రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ విక్టర్ ఎంపీడీవో రాజ్ కిరణ్ రెడ్డికి సూచించారు. మంగళవారం రెవెన్యూ కార్యాలయ సమీపంలో నిర్మాణం చేపడుతున్న ఇందిరమ్మ మోడల్ హౌస్ పనులు పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ధరణి, ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల రికార్డులు పరిశీలించారు. రెవెన్యూ కార్యాలయ పనులు పెండింగ్‌లో పెట్టకుండా త్వరగా పూర్తి చేయాలని తహసీల్దార్ శివ ప్రసాద్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రోజా, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బాలయ్య, పంచాయతీ కార్యదర్శి బాబు, మండల పరిషత్, రెవెన్యూ సిబ్బంది, తదితరులున్నారు.


పనులు పరిశీలిస్తున్న రెవెన్యూ అడిషన్ కలెక్టర్

జీవితంపై విరక్తి చెంది యువకుడి ఆత్మహత్య



నవతెలంగాణ-లింగంపేట్

జీవితంపై విరక్తి చెంది యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన లింగంపేట్ మండలంలోని శెట్టిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. శెట్టిపల్లి గ్రామానికి చెందిన కమ్మరి ప్రవీణ్ కుమార్ (27) తల్లిదండ్రులు చనిపోవడంతో ఒంటరిగా జీవిస్తు న్నాడు. ఆటో నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. మతుని అక్క మౌనిక తాడ్వాయి మండలం సంగోజివాడ గ్రామానికి చెందిన వ్యక్తితో వివాహం చేశారు. భర్త చనిపోవడంతో తల్లిగారి ఇంటి వద్దనే ఉంటోంది. తమ్ముడి బాధ్యతలను అక్క చూసుకుంటుంది. తల్లిదండ్రులు లేరని, పెండ్లి కావడం లేదని తీవ్ర మనస్థాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో వారి అక్క తాడ్వాయి మండలంలోని సంగోజీపేట గ్రామంలో బంధువుల ఇంటికి వెళ్ళగా.. ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తమ్ముడికి ఫోన్ చేసినా స్విచ్ఛాఫ్ రావడంతో.. చుట్టుపక్కల వారికి సమాచారం ఇచ్చింది. వారు తలుపులు తీసి చూడగా దూలానికి ఉరేసుకొని ఉన్నాడు. స్థానిక పోలీసులకు సమాచారం అందించగా అక్కడికి హెడ్ కానిస్టేబుల్ రాజయ్య చేరుకొని ఆత్మహత్యకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. పంచనామా నిర్వహించి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్క మౌనిక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వరి పంటను పరిశీలించిన ఏవో


పంటను పరిశీలిస్తున్న ఏవో

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలో లక్ష్మీ నరసయ్య రైతు వరి పంటను ఏవో ప్రజాపతి పరిశీలించారు. ఈ సందర్భంగా పంటకు అగ్గి తెగులు, మోగి పురుగు సోకిందని అన్నారు. వాతావరణ ప్రభావం వల్ల వరి పంటకు రోగాలు వస్తున్నాయని ఆయన తెలిపారు. వీటి నివారణకు పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు. నీటిని సరైన పద్ధతిలో వినియోగించుకోవాలని అన్నారు. అగ్గి తెగులు, మోగి పురుగు నివారణ కోసం రైతులకు పిచికారీ చేసే మందుల గురించి రైతులకు తెలిపారు.

పర్యాటక కేంద్రంగా లింగంపేట్

- డిఆర్‌డిఓ పిడి సురేందర్


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న డిఆర్‌డిఓ పిడి సురేందర్

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ పట్టణాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతానని డిఆర్‌డిఓ పిడి సురేందర్ అన్నారు. మంగళవారం మండలంలోని పర్మళ్ల గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి పనులను పరిశీలించారు. కూలీల చేస్తున్న పనులను పరిశీలించారు. వారి హాజరు శాతాన్ని కూలీలను అడిగి తెలుసుకున్నారు. పని ప్రదేశంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పశువుల షెడ్డును పరిశీలించారు. మండల కేంద్రంలోని చారిత్రాత్మక జోగినాథ్ గుట్టపై ఉన్న శివుని ఆలయాన్ని సందర్శించారు. అనంతరం సొరంగాన్ని, గుట్టపై ఉన్న చెలిమెను పరిశీలించారు. నగరేశ్వర ఆలయ ముందు ఉన్న గాలికి ఊగే గజ స్తంభాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగంపేట్ మండల కేంద్రానికి ప్రత్యేకత ఉందన్నారు. లింగంపేట్ పట్టణాన్ని పర్యాటక కేంద్రంగా మార్చడానికి అవకాశాలున్నాయని, తన వంతు కృషి చేస్తానని చారిత్రక కట్టడాలకు పూర్వవైభవం తెస్తానన్నారు. ఈయన వెంట ఎంపీడీవో నరేష్, ఎంపిఓ మలహరి, ఐకెపి ఎపిఎం శ్రీనివాస్, గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రావణ్ కుమార్, క్షేత్ర సహాయకులు, గ్రామ పంచాయతీ సిబ్బంది గ్రామస్తులున్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి గెలుపు పట్ల హర్షం

నవతెలంగాణ-రెంజల్

నల్గొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో శ్రీపాల్ రెడ్డి గెలుపొందడం హర్షనీయమని రెంజల్ పిఆర్టియు మండల శాఖ హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా పిఆర్టియు మండల అధ్యక్షులు సోమలింగం గౌడ్ మాట్లాడుతూ.. పిఆర్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తారని ఆయన అన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం పిఆర్టియుతోనే సాధ్యమని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కిషోర్ కుమార్, పిఆర్టియు మండల శాఖ సభ్యులు, ప్రాథమిక సభ్యులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమిపూజ


ఇల్లు నిర్మాణానికి ముగ్గుపోస్తున్న దృశ్యం

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని ర్యాగట్లపల్లి గ్రామంలో మంగళవారం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమాన్ని ఎంపీడీవో రాజ్ కిరణ్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా భూమి పూజ కార్యక్రమంలో భాగంగా ముగ్గుపోసి పనులు ప్రారంభించారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ పనులు జరుగుతున్న క్రమంలో నిధులు విడుదల చేయనున్నట్టు తెలిపారు. త్వరగా పనులు పూర్తిచేయాలని లబ్దిదారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సౌజన్య, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

ఘనంగా లైన్‌మెన్ దినోత్సవం


లైన్‌మెన్ దినోత్సవంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

నవతెలంగాణ-కామారెడ్డి

లైన్మెన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం కామారెడ్డి టౌన్ సబ్ డివిజన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కళాభారతి ఆడిటోరియంలో అన్మన్నెడ్, ఆర్టిషన్స్, జేఎల్ఎం, ఏఎల్ఎం, ఎల్ఐ, ఎస్ఎల్ఐ, ఎఫ్ఎంలను ఘనంగా సన్మానించినట్టు కామారెడ్డి విద్యుత్ సూపరింటెండెంట్ ఇంజనీర్ నీల శ్రవణ్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని కళాభారతి ఆడిటోరియంలో అన్మన్నెడ్, ఆర్టిషన్స్, జేఎల్ఎం, ఏఎల్ఎం, ఎల్ఐ, ఎస్ఎ ల్ఐ, ఎఫ్ఎంలు సంస్థాభివృద్ధికి అందిస్తున్న అపరిమిత సేవలను ప్రశంసిస్తూ, భవిష్యత్తులో వారికి మరిన్ని అవకాశాలు అందించాలని తెలిపారు. విద్యుత్ సరఫరా నిరంతరాయంగా కొనసాగేందుకు అహర్నిశలు కష్టపడే ఈ కార్యదక్షుల సేవలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది, లైన్మెన్‌లు తమ అనుభవాలను పంచు కుని, సంస్థ పురోగమించేందుకు తమవంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ ఇంజనీర్ (టెక్నికల్) ప్రభాకర్, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ కిరణ్ చైతన్య, అలాగే ఏఈలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న మెడికల్ అధికారి

నవతెలంగాణ-రాజంపేట్

ఆరోగ్య మహిళా కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాజంపేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళలకు మెడికల్ అధికారి విజయ మహాలక్ష్మి వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యుల సూచనలు సలహాలు పాటించి ప్రతిరోజు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఐశ్వర్య, సంగీత, హెల్త్ సూపర్వైజర్ మంజూర్, గంగమణి, స్టాఫ్ నర్స్ సుమలత, ల్యాబ్ టెక్నీషియన్ సంతోష్, ఏఎన్ఎం జ్యోతి, చంద్రకళ, రజిత, యాదమ్మ, చందబిబి, శ్రీలత, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం

నవతెలంగాణ-బాల్కొండ

బాల్కొండ మండలం కిసాన్ నగర్ లోని లయన్స్ భవనంలో మంగళవారం బాల్కొండ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. నిజామాబాద్ లయన్స్ కంటి ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ ప్రవళిక కంటి పరీక్షలు చేశారు. మోతి బిందు ఉన్న వారిని గుర్తించి శాస్త్ర చికిత్సల కోసం ఆర్మూర్ లయన్స్ ఆసుపత్రికి తరలించారు. లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ చాకులింగం, అధ్యక్షుడు దినేష్ పటేల్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.



అంగన్వాడీ టీచర్ల ముందస్తు అరెస్ట్

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలానికి చెందిన అంగన్వాడీ టీచర్లను మంగళవారం పోలీస్‌లు ముందస్తు అరెస్ట్ చేశారు. మినీ అంగన్వాడీలకు పది నెలలుగా పెంచిన వేతనాలు ఇవ్వకపోవడంతో హైదరాబాద్ ప్రజావాణిలో వినతిపత్రం అందిస్తామని వెళ్ళే క్రమంలో తమను ముందస్తు అరెస్ట్ చేసినట్లు అంగన్వాడీ టీచర్లు తెలిపారు. అరెస్టయినవారిలో అంగన్వాడీ టీచర్లు చంద్రకళ, సుజాత, శోభ, పద్మ ఉన్నారు.



అరెస్టయిన అంగన్‌వాడీ టీచర్లు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని చేపూర్ గ్రామంలో ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసినట్లు శక్తి కేంద్రం ఇంచార్జ్ ఇంచార్జ్ సతీష్ (బబ్లు) ఎక్స్ ఎంపిటిసి బాల నరసయ్య మంగళవారం తెలిపారు. ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ తీసుకొని చెక్కులు పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో సత్యనారాయణ, గంగారెడ్డి, శివరాజ్, తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న నాయకులు

మధ్యాహ్న భోజనం తనిఖీ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని జీరాయత్ నగర్‌లో బాలుర ఉన్నత పాఠశాలను మంగళవారం మున్సిపల్ కమిషనర్ రాజు సందర్శించి మధ్యాహ్న భోజనంను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా..? రుచికరంగా చేస్తున్నారా.. లేదా అనే విషయాన్ని విద్యార్థులకు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెనూ కచ్చితంగా పాటించాలని , రుచికరంగా వండాలని నిర్వాహకులకు సూచించారు. మెనూ వివరాలని విద్యార్థులకు కనపడే విధంగా ప్రదర్శించాలని సూచించారు. భోజనంలో నాణ్యత పాటించాలని, రుచికరంగా చేసే విధంగా చూసుకోవాలని హెచ్ఎంకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

బేస్‌బాల్‌లో కేజీబీవీ విద్యార్థిని ప్రతిభ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని కేజీబీవీ పాఠశాల విద్యార్థిని యశస్విని రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బేస్‌బాల్ పోటీలలో ప్రతిభ కనబరిచినట్టు పాఠశాల స్పెషల్ ఆఫీసర్ గంగామణి మంగళవారం తెలిపారు. జనవరి 28 నుంచి ఫిబ్రవరి 2 వరకు కేజీ టు పీజీ గ్రౌండ్ గజ్వేలు సిద్దిపేట జిల్లాలో జరిగినటువంటి ఐదవ రాష్ట్ర సబ్ జూనియర్ బేస్‌బాల్ పోటీలలో పాల్గొని అత్యంత ప్రతిభ కనపరచి ప్రథమ బహుమతి పొందినట్టు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల బృందం విద్యార్థిని అభినందించారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఐఎఫ్‌టియు



లేబర్ ఆఫీస్ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లాలో భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డులో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం (ఐఎఫ్‌టియు) రాష్ట్ర నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్‌కు ఐఎఫ్‌టియు ప్రతినిధి బృందం 18 సమస్యలతో కూడిన మెమోరాండంను ఆల్ ఇండియా కోఆర్డినేషన్ కమిటీ పిలుపుమేరకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో భవన నిర్మాణ రంగంలో రోజు రోజుకు కార్మిక వర్గం పెరుగుతున్నదని, వీరికి భద్రత, చట్ట బద్ధహక్కులు అమలు చేయించడంలో ప్రభుత్వాలు వైఫల్యం చెందుతున్నాయన్నారు. పని స్థలాల్లో ప్రమాదాలు జరిగి అంగవైకల్యంగా మారి అనేకమంది మృతి చెందుతున్న వారికి ఎలాంటి సదుపాయాలు కల్పించడంలేదని తెలిపారు. లేబర్ కార్డు లేదనే పేరుతో రెన్యువల్ కాలేదని పేరుతో కార్మికులకు మొండి చేయి చూపడం సరికాదన్నారు. భవన నిర్మాణ కార్మికుడై ఉన్నందున అన్ని రకాల సంక్షేమ పథకాలను వర్తింప చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ బోర్డుని ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పాలనె ఆలోచనను విరమించుకోవాలని, బోర్డు ద్వారానే సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించి, 55 సంవత్సరాల నిండిన వారికి పదివేల రూపాయల పెన్షన్ సౌకర్యం కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు జి.భూమన్న, తెలంగాణ ప్రగతిశీల.భవన ఇతర నిర్మాణ కార్మిక నాయకులు ఎల్లప్ప మల్లేష్, శ్రీనివాస్, అశోక, రమేష్, ప్లంబర్ వర్కర్స్, తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం కార్డు మార్చి రూ.10వేలు డ్రా

వృద్ధురాలిని మోసగించిన వ్యక్తి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని ఒకటవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏటీఎం కార్డును మార్చి ఓ వృద్ధురాలిని గుర్తు తలియని వ్యక్తి మోసం చేశాడని ఎస్‌హెచ్ఓ రఘుపతి మంగళవారం తెలిపారు. ఎస్‌హెచ్ఓ రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ మిర్చి కాంపౌండ్‌కి చెందిన ఎస్.కె అనేస్ బేగు(65) గృహిణి మార్చి 3న ఉదయం 11 గంటలకు తన డబ్బులను విడ్రా చేసుకోవడానికి బోధన్ రోడ్ వద్ద ఉన్న ఎస్‌బిఐ ఎటిఎంకు వెళ్లింది. అక్కడ గుర్తు తెలియని వ్యక్తికి ఏటీఎం కార్డు ఇచ్చి డబ్బులు డ్రా చేసి ఇవ్వమని అడగగా, అతను 10 వేలు డ్రా చేసి ఇవ్వగా మిగిలిన డబ్బులు రావడం లేదని చెప్పి ఏటీఎం కార్డును మార్చి ఇచ్చి అక్కడ నుంచి వెళ్లిపోయాడు. తర్వాత ఆమె బ్యాంకుకు వెళ్లి ఓచర్ ద్వారా డబ్బులు తీసుకుందామని వెళ్తే బ్యాలెన్స్ వృద్ధురాలు చెప్పినంత లేదని బ్యాంక్ అధికారులు తెలిపారు. ఆమె రూ.10వేలు ఏటీఎం కార్డు ద్వారా గుర్తు తెలియని వ్యక్తి డ్రా చేసినట్టుగా తెలిసింది. ఈ విషయంపై ఒకటవ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఇంటర్మీడియట్ పరీక్షల ఏర్పాట్లు పూర్తి

- నేటి నుండి పరీక్షలు ప్రారంభం
- చీఫ్ సూపరిండెంట్ బీ సురేష్ బాబు

నవతెలంగాణ-ధర్పల్లి

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఏర్పాట్లు పూర్తి అయినట్లు చీఫ్ సూపెరిండేంట్ సురేష్ బాబు మంగళవారం ఓప్రకటనలో తెలిపారు. బుధవారం ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభం కానున్నాయని, ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి లేదని, సెల్ ఫోన్లు, వాచీలు ఎట్టిపరిస్థితుల్లో పరీక్షాకేంద్రాల్లోకి అనుమతి లేదని తెలిపారు. తమ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం 280 విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు .

పేదల ఆరోగ్య సంరక్షణే లక్ష్యం

- ప్రజలు, విద్యార్థులు, మహిళలను చైతన్య పరుస్తూ కార్యక్రమాలు
- విద్యార్థులకు కంటి, వైద్యపరీక్షలు, మానసిక ఆరోగ్య కార్యక్రమాలు
- సూర్య ఆరోగ్య సంస్థ చైర్మన్ ఉదయ సూర్య భగవాన్

ఆరోగ్య జీవితమే ప్రతి మనిషికి తరగని ఆస్తి అని, పేద ప్రజల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా వైద్య సేవలు అందిస్తున్నట్టు సూర్య ఆరోగ్య సంస్థ చైర్మన్ ఉదయ సూర్య భగవాన్ తెలిపారు. ప్రతి వ్యక్తి ఆరోగ్య సంరక్షణ ఇంటి వద్దే చేసుకోవాలన్న విజన్‌తో 2017 డిసెంబర్ 22న తన కుమారుడు సూర్యతేజ.. సూర్య ఆరోగ్య సంస్థను స్వచ్ఛంద సేవా సంస్థగా ప్రారంభించినట్టు తెలిపారు. హెల్త్‌క్యాంప్‌లు నిర్వహిస్తూ, ఆరోగ్య పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను నవతెలంగాణకు వివరించారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే..

నవతెలంగాణ-కంఠేశ్వర్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

పేదలకు, మధ్యతరగతి కుటుంబాలు, గ్రామీణ ప్రాంత వాసులకు ఆరోగ్యవసరులపై సరైన అవగాహన లేక ఆర్థికంగా నష్టపోతున్నారని, కొన్నిసార్లు సరైన సమాచారం లేక విలువైన సమయాన్ని కోల్పోయి ప్రాణ నష్టం సంభవిస్తుందని ఆయన కుమారుడు సూర్యతేజ గమనించారు. వైద్య విద్యను అభ్యసించి తర్వాత ప్రభుత్వ ప్రైవేటు ఆస్పత్రుల్లో, స్వచ్ఛంద సంస్థల క్లినిక్‌లలో పనిచేసి తనకు ఎదురైన అనుభవాలతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ వైద్య సదుపాయాలపై అవగాహన కల్పిస్తూ సూర్య ఆరోగ్య సంస్థ వారధిగా పనిచేస్తుందని అన్నారు. పిల్లల ఆరోగ్య సంరక్షణ ద్వారా ఆరోగ్యవంతమైన భావితరాలను నిర్మించాలని కృషి చేస్తున్నది. వద్ధుల ఆరోగ్యాన్ని సంరక్షిస్తూ వారికి ఆరోగ్యాన్ని అందించడానికి వివిధ కార్యక్రమాలను రూపొందించి అమలు చేస్తున్నట్టు తెలిపారు.

వైద్యసదుపాయం, ఆరోగ్యంపై అవగాహనా కార్యక్రమాలు

సూర్య ఆరోగ్య సంస్థ మారుమూల గ్రామాలు, గిరిజన తండాల్లో వైద్య సౌకర్యాలు తక్కువ ఉన్న ప్రాంతాల్లో వైద్య సదుపాయం, ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. సూర్య ఆరోగ్య సంస్థ లక్ష్యాలను చేరుకోవడం కోసం ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ స్వచ్ఛంగా సేవా సంస్థలతో కలిసి పని చేయడానికి కషి చేస్తున్నామని తెలిపారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో పనిచేస్తూ సంస్థ తన కార్యకలాపాలను తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించాలని ప్రణాళికలను తయారు చేసుకుందని వెల్లడించారు. సూర్య ఆరోగ్య సంస్థ పలు ప్రాజెక్టుల ద్వారా ప్రజలను విద్యార్థులను మహిళలను చైతన్య పరుస్తూ వారికి ఆరోగ్య సదుపాయాలను అందుబాటులోకి తీసుకుని వస్తున్నట్టు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరాలు

గ్రామీణ ప్రజల్లో ఆరోగ్యంపై ఆసక్తిని, అవగాహనను పెంపొందించుటకు వివిధ గ్రామాల్లో ప్రజల ఆరోగ్య అవసరాలను దష్టిలో ఉంచుకొని 20 ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వీటి ద్వారా ఇప్పటివరకు 2608 రోగులు లబ్ది పొందారు. అధికంగా వద్ధులు, మహిళలు వైద్య పరీక్షల ద్వారా రోగాలను నిర్ధారించుకొని అర్హత కలిగిన వైద్యుల ద్వారా చికిత్సను ఉచితంగా మందులను తీసుకొని ఆరోగ్యాలను మెరుగుపరుచుకుంటున్నట్టు తెలిపారు.

మెగా వైద్య శిబిరాలు

గ్రామీణ ప్రాంతాలలో నరాల సమస్యలు, స్త్రీ సమస్యలు, కంటి సమస్యలు, దంత సమస్యలు, కీళ్ల, ఎముకల సమస్యలు, గుండె సమస్యలు, మూత్రపిండాల సమస్యలు, కిడ్నీల సమస్యలు, ఊపిరితిత్తుల సమస్యలు, చెవి, ముక్కు, గొంతు సమస్యల వంటి వివిధ ఆరోగ్యపరమైన సమస్యలపై ప్రజలలో అవగాహన కల్పిస్తూ అందుబాబులో ఉన్న వైద్య సంపాయాలు, వనరులపై సమాచారాన్ని చేరవేస్తున్నది. అలాగే ప్రభుత్వ, ప్రైవేటు సూపర్ స్పెషాలిటీ వైద్యుల సహకారంతో మెగా హెల్త్ క్యాంపులు నిర్వహించారు. ఆరు మెగా హెల్త్ క్యాంపుల ద్వారా 1847 మంది రోగులకు సూపర్ స్పెషాలిటి వైద్య సేవలను అందించారు.



మహిళలకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

భోజన ఆరోగ్య పథకం..

ఈ పథకం ద్వారా దీర్ఘకాలికంగా వ్యాధులతో బాధపడుతూ సరైన పోషకాహారం లేక చికిత్సను నిర్లక్ష్యం చేస్తున్న పేద రోగులకు కౌన్సెలింగ్ తో పాటు పౌష్టికాహారాన్ని అందించి వారు రోగంనుండి కోలుకొని తిరిగి తమ ఆరోగ్యాన్ని, ఆదాయాన్ని పెంపొందించుకోవడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. హెచ్ఐవి, టీబీ 230 మంది రోగులకు పౌష్టికాహారాన్ని అందించి వారి ఆరోగ్యం, ఆదాయాన్ని మెరుగుపరచడంలో దోహద పడినట్టు తెలిపారు.


విద్యార్థులకు కంటి, దంత పరీక్షలు..

స్వస్థ నేత్ర ప్రాజెక్టు కింద విద్యార్థులకు కంటి సంరక్షణ, ఉచిత దంత పరీక్ష శిబిరాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పాఠశాల కళాశాల, యూనివర్సిటీ విద్యార్థులకు మానసిక ఒత్తిడి, పరీక్షల భయం, కోపం, ఆందోళన, ఆత్మహత్య ఆలోచనలు మొదలగు వాటిపై అవగాహన కల్పించి వారి మానసిక ఆరోగ్య వికాసానికి ఉన్నత జీవిత లక్ష్యాలను ఏర్పరచుకోవడంలో ఉత్తమ ఫలితాలు సాధించుటకు జిల్లా మానసిక వైద్య నిపుణుల సహకారంతో 12 మానసిక ఆరోగ్య కార్యకమాలను నిర్వహించినట్టు తెలిపారు.



ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

సేవ చేయాలనే లక్ష్యంతోనే..



సూర్య ఆరోగ్య సంస్థ సమాజంలో వెనుకబడి పేద ప్రజలకు వైద్యం, ఆరోగ్యంకోసం వారికి సేవ చేయాలనే ఉద్దేశంతో ఈ సంస్థను ప్రారంభించాం. గ్రామాల్లో పేద ప్రజలకు వైద్య సేవలు అందిస్తూ ఉచితంగా మందులు కూడా ఇస్తున్నాం. ఐదు గ్రామాలను దత్తత తీసుకుని అక్కడ పేదలకు వైద్యం అందించడానికి సర్వే నిర్వహించాం. ఈ మధ్యనే తెలంగాణ యూనివర్సిటీలో ఎంఓయు చేసుకున్నాం. సమాజంలో మరింత సేవలందించి ప్రజలకు మరింత సేవ చేయాలనే ఉద్దేశంతో ఉన్నట్టు తెలిపారు.

రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్టాపన

పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా కేంద్రంలోని వినాయక్ నగర్ షిర్డీ సాయి నగర్‌లో శ్రీ మావురాల రేణుక ఎల్లమ్మ దేవస్థానం విగ్రహ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమంలో నగర మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల మంగళవారం హాజరయ్యారు. నగర ప్రజలు అమ్మవారి ఆశీస్సులతో సుఖశాంతులతో ఉండాలని కోరారు. కార్యక్రమంలో మాజీ నగర మేయర్ దండు నీతూ కిరణ్, మాజీనూడ చైర్మన్ చామకూర ప్రభాకర్‌రెడ్డి, నగర అధ్యక్షులు సిర్ప రాజు, సీనియర్ నాయకులు సుదాం రవిచందర్, సత్యప్రకాశ్, తడ్కల్ శ్రీను, బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా

గ్రంథాలయ భవనం అందుబాటులోకి తేవాలి

- జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతరెడ్డి రాజిరెడ్డి

నవతెలంగాణ -భీంగల్ రూరల్

నిజామాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతరెడ్డి రాజారెడ్డి మంగళవారం భీంగల్ పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న శాఖా గ్రంథాలయ భవనాన్ని తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ చైర్మన్ మాట్లాడుతూ... 28 లక్షల రూపాయలతో నిర్మిస్తున్నట్టు తెలిపారు. భవన నిర్మాణ పనులు వేగవంతం చేసి మార్చి నెల చివరి లోగా స్థానిక గ్రంథాలయ పాఠకులకు భవనం అందుబాటులోకి తేవాలని ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. త్వరలో తెలంగాణ ప్రభుత్వం జాబ్ క్యాలండర్ విడుదల అవకాశాలు ఉన్నందున భవనాన్ని నిరుద్యోగులకు ఉపయోగంలోకి తీసుకురావాలని తెలిపారు. పాఠకుల సమస్యలు ఏవైనా ఉంటే తన దృష్టికి తేవాలని లైబ్రేరియన్‌ను ఆదేశించారు. గ్రంథాలయ అభివృద్ధి విషయంపై స్థానిక నాయకులతో అడిగి చర్చలు జరిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు జేజే నర్సయ్య, మాజీ ఎంపీపీ కన్నె సురేందర్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పర్స అనంతరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆరేపల్లి నాగేంద్రబాబు,మాజీ కౌన్సిలర్ లో మల్లెల రాజా శ్రీ లక్ష్మణ్, సిహెచ్ గంగాధర్, ధరావత్ లింగయ్య, (లింగం) మైనార్టీ జర్నల్ సెక్రెటరీ మహమ్మద్ జీషాన్, సాయిబాబా, మొండి దినేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



భవనాన్ని పరిశీలిస్తున్న గ్రంథాలయ చైర్మన్

డిగ్రీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ (బి. ఏ, బి. కామ్, బీఎస్సీ లైఫ్ సైన్సెస్, బీఎస్సీ ఫిజికల్ సైన్స్, బి బి ఏ, బీసీఏ) ఒకటవ మూడవ మరియు ఐదవ సెమిస్టర్ ఫలితాలను వైస్ ఛాన్సలర్ టి యాదగిరిరావు, రిజిస్టార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.యాదగిరి, కంట్రోలర్ ప్రొఫెసర్ సంపత్ కుమార్ ఇతరులతో కలిసి మంగళవారం విడుదల చేశారు. బిఎలో 3534 మంది విద్యార్థులు హాజరుకాగా 998 మంది 28.24శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలురు 13.70 శాతం కాగా బాలికలు 44.04శాతం ఉత్తీర్ణులయ్యారు. బికాంలో 5578మంది విద్యార్థులు హాజరుకాగా 1902 మంది 34.10 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలురు 17.55 శాతం కాగా బాలికలు 49.76శాతం ఉత్తీర్ణులయ్యారు. బీఎస్సీ లైఫ్ సైన్స్‌లో 5644 మంది విద్యార్థులు హాజరుకాగా 2279మంది 40.38 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలురు 17.34శాతం కాగా బాలికలు 44.04శాతం ఉత్తీర్ణులయ్యారు. బీఎస్సీ ఫిజికల్ సైన్స్ లో 4199 మంది విద్యార్థులు హాజరుకాగా 1003మంది 23.89 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలురు 6.01 శాతం కాగా బాలికలు 31.31శాతం ఉత్తీర్ణులయ్యారు. బిబిఎ లో 597 మంది విద్యార్థులు హాజరుకాగా 252 మంది 42.21శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలురు 21.45 శాతం కాగా బాలికలు 65.72శాతం ఉత్తీర్ణులయ్యారు. బిసిఎ లో 22 మంది విద్యార్థులు హాజరుకాగా 2 (ఇద్దరు)మంది 9.09శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలురు 5.00 శాతం కాగా బాలికలు 50.0శాతం ఉత్తీర్ణులయ్యారు. మొత్తం విద్యార్థులు19574మంది విద్యార్థులు హాజరుకాగా 6436మంది 32.88శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలురు 14.58 శాతం కాగా బాలికలు 42.83శాతం ఉత్తీర్ణులయ్యారు. ఈ ఫలితాల విడుదల కార్యక్రమంలో అడిషనల్ కంట్రోల్లర్స్ డాక్టర్ నందిని, డాక్టర్ శాంతాబాయి, డాక్టర్ సంపత్ తదితరులు పాల్గొన్నారు. పూర్తి వివరాలు తెలంగాణ వర్సిటీ వెబ్సైట్లో పొందుపరచడం జరిగిందని కంట్రోలర్ తెలిపారు.



ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ, కంట్రోలర్లు

రైతు సంక్షేమం కోసం పనిచేస్తా

- భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ అధ్యక్షుడు కొండెల సాయి రెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

చివరి శ్వాస వరకు రైతు సంక్షేమం కోసమే పని చేస్తానని భారతీయ కిసాన్ సంఘ్ నూతన జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన కొండల సాయిరెడ్డి వ్యాఖ్యానించారు. భారతీయ కిసాన్ సంఘ్ 46వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా సాయి రెడ్డి ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని జిల్లా శాఖ ఆధ్వర్యంలో మారుతీ నగర్‌లోని గణేష్ భవన్‌లో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సాయిరెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని గ్రామాల్లో కమిటీలను ఏర్పాటు చేసి రైతాంగ సమస్యల గురించి పోరాటం చేయటమే లక్ష్యంగా పనిచేస్తామని వ్యాఖ్యానించారు. సారంగాపూర్ చక్కెర కర్మాగారాన్ని తిరిగి ప్రారంభించడం ద్వారా వెయ్యి మందికి ఉపాధి, పంట మార్పిడి పద్ధతి ద్వారా వేలాది మంది రైతులకు ఉపాధి లభిస్తుందని అందుకోసమే ఆ ఫ్యాక్టరీని తిరిగి తెరిపించటం కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధపడతామని వ్యాఖ్యానించారు. ఆర్ఎస్ఎస్ విభాగ్ ప్రచారక్ నర్రా వెంకట శివకుమార్ మాట్లాడుతూ.. రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గ చూపాలని, ఆ దిశగా దేశవ్యాప్తంగా ఉన్న నూతన ప్రయోగాలను విస్తృత ప్రచారం చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సభాధ్యక్షులు కె.నారయణ రెడ్డి, జోనల్ కార్యదర్శి , భారతీయ కిసాన్ సంఘ్ ,ముఖ్య అతిథి కొండెల సాయ రెడ్డి , జాతీయ అధ్యక్షుడు, భారతీయ కిసాన్ సంఘ్ , విశిష్ఠ అతిథి : నార్రా వెంకట శివ కుమార్ , ఇందూరు విభాగ్ ప్రచారక్, తెలంగాణ ప్రాంత సహ భౌద్ధిక్ ప్రముఖ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లైన్మెన్ దినోత్సవం



నవతెలంగాణ-మోపాల్

నిజామాబాద్ రూరల్ సబ్ డివిజన్ లో "లైన్ మెన్" దినోత్సవం మంగళవారం నిర్వహించారు. డిచ్పల్లి డిఈ ఉత్తమ్ జాడే, నిజామాబాద్ రూరల్ ఏడి ఈ రెంజర్ల బాలేష్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లైన్మెన్ పనితీరు అద్భుతం అని అన్నారు. కింది స్థాయిలో వారి కృషి ఎనలేనిదని, వారు చేస్తున్న పనిని వారు ప్రశంసించారు. కార్యక్రమంలో ఏఈలు శంకర్, బాబా శ్రీనివాస్, నాగ శర్వాణి, రాజేందర్, భాస్కర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నేటి నుండి జరిగే ఇంటర్ మొదటి సంవత్సర పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. డిచ్ పల్లి మండలం లో ఇంటర్ పరీక్షలకు నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో హాల్ టికెట్ నెంబర్లు వేసి సర్వం సిద్ధం చేసినట్లు అధికారులు వివరించారు.

పంటలకు రక్షణ "మంచె"


పంట చేనుకు కాపలకోసం రైతు తయారు చేసుకున్న మంచె

నవతెలంగాణ-బోధన్

రైతులు పండించే పంటలు చేతికొచ్చే సమయానికి పక్షులు వాలి మొక్కజొన్న గింజలను తినేస్తాయి. దాంతో రైతులు పంట నష్టపోయి ఇబ్బందులు పడాల్సి వస్తుంది. పంట నష్టం కాకుండా రైతులు పక్షులను తరమడానికి కట్టెలతో చిన్నపాటి "మంచె" లాంటివి ఏర్పాటు చేసుకుని పంటలకు రక్షణగా ఉంటారు. ఈ మంచెపై రైతు నిలబడి దారాలతో తయారుచేసిన 'గోపన్' అనే దాంట్లో రాళ్లపెట్టి పక్షులను తరిమేసి పంటలను కాపాడుకుంటారు. పురాతన కాలం నుంచే ఉన్న ఈ విధానం ప్రస్తుతం మహారాష్ట్ర సరిహద్దు గ్రామీణ ప్రాంత శివారులో కనబడుతోంది.

ఘనంగా లైన్మెన్ దినోత్సవం


అధికారిని సన్మానిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-నిజామాబాద్

ఎడపల్లి మండల కేంద్రంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో లైన్మెన్‌ల దినోత్సవాన్ని ఆ శాఖ అధికారులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లోని సబ్ స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న లైన్‌మెన్‌లను విద్యుత్ శాఖ, సబ్ డివిజన్ ఎడపల్లి ఏడిఈ ప్రభాకర్‌రెడ్డి, ఏఈ కిషోర్‌రెడ్డి, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్, లైన్మెన్‌లు, జూనియర్ లైన్మెన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నీరు పొంగిపొర్లై..
దాహార్తి తీరే..


పైపు ద్వారా పారుతున్న నీరు

నవతెలంగాణ-బోధన్

ప్రస్తుతం వేసవికాలం దృష్ట్యా ఇప్పుడే ఎండల తీవ్రత ఎక్కువైంది. పశువుల దాహర్తి తీర్చడానికి చెరువులు లేనిచోట్ల పశువులు ఇబ్బందులు పడే పరిస్థితులు నెలకొన్నాయి. కానీ బండారుపల్లి గ్రామస్థులు మాత్రం పశువుల దాహర్తి తీర్చడానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. మండలంలోని బండారుపల్లి గ్రామంలో తాగునీటి ట్యాంక్ పూర్తిగా నిండిన తర్వాత బయటకు పొంగిపొర్లే నీరు అలాగే వృథాగా వదిలేయకుండా పొడవాటి పైపు ద్వారా ఆ నీటిని నీటితొట్టి నిండేలా చేశారు. దాంతో గ్రామంలోని పశువులకు తాగునీటి సమస్య తీరింది. గ్రామస్తులు పశువుల పట్ల చూపిన ప్రయత్నాన్ని పలువురు అభినందిస్తున్నారు. ప్రతి గ్రామంలో కూడా వృథా నీటిని పశువుల సౌకర్యార్థం ఇలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా తాగునీరు అందిస్తే మూగజీవులకు మేలుచేసినవారమవుతామని పలువురు అంటున్నారు.

స్వార్థపూరిత రాజకీయాలే
జుక్కల్ వెనుకబాటుకు కారణం

- మద్నూర్ మండల కేంద్రానికి రూ.75 లక్షల నిధులు మంజూరు
- మద్నూర్ పాత తాలూకాకు పూర్వ వైభవం తీసుకువస్తా
- ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న మండల నాయకులు

నవతెలంగాణ-మద్నూర్

జుక్కల్ నియోజకవర్గం అభివృద్ధి చెందలేకపోవడానికి కారణం స్వార్థపూరిత రాజకీయాలేనని జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో మండలం నాయకులతో మాట్లాడుతూ.. జుక్కల్ అభివృద్ధికి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన హనుమంతు షిండే స్వార్థపూరిత రాజకీయాలే నడిపారని తెలిపారు. అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోలేదని అన్నారు. మద్నూర్ మండల అభివృద్ధికి శాయశక్తుల కృషి చేస్తానని, ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరు చేయడం, కేంద్రీయ విద్యాలయాన్ని మంజూరు చేయించడం, లేండి ప్రాజెక్టును పూర్తి చేసి వచ్చే సంవత్సరానికి సాగునీటి ప్రారంభిస్తానని హామీ ఇచ్చారు.

మద్నూర్ మండల కేంద్రానికి సిసి రోడ్ల నిర్మాణానికి రూ.50 లక్షలు, శ్రీ లక్ష్మీనారాయణ ఆలయ అభివృద్ధికి 25 లక్షలు మంజూరు చేసినందుకు ఆలయ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు గ్రామస్తులు కలిసి ఎమ్మెల్యేకు ప్రత్యేకంగా సన్మానించి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు శ్రీ లక్ష్మీనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్య


హరికుమార్ మృతదేహం

నవతెలంగాణ-నిజాంసాగర్

మద్యానికి బానిసైన యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలోని నిజంసాగర్ ప్రాజెక్టు వద్ద మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై శివకుమార్ కథనం ప్రకారం.. ఆంధ్యాల హరికుమార్ (26) శనివారం ఉదయం 10 గంటల సమయంలో తన ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. నిజాంసాగర్ ప్రాజెక్టులో హరికుమార్ దూకుతుండగా బంజేపల్లి గ్రామ నివాసి మొగులయ్య చూసి హరికుమార్ తల్లి రాజమణికి చెప్పాడు. శనివారం నుంచి మృతుడి కోసం ప్రాజెక్టులో వెతకగా మంగళవారం ప్రాజెక్ట్ ఒడ్డు వద్ద శవం దొరికిందని ఎస్ఐ తెలిపారు. మృతుడు ఎలాంటి పని చేయకుండా మద్యానికి బానిసై మానసికంగా ఆర్థికంగా ఇబ్బందులకు గురై జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడని మృతుని తల్లి రాజమణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య



నవతెలంగాణ-తాడ్వాయి

పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని దేమికలాన్ గ్రామానికి చెందిన బంగారు గాళ్ల అభిజిత్(24) పనులు చేయాలని నానమ్మ శాంతమ్మ చెప్పగా మనస్థాపానికి గురై మార్చి 1న పురుగుల మందు తాగి ఆత్మ హత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబీకులు కామారెడ్డి పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ బీసీ సెల్ మండలాధ్యక్షుడి మృతి



నవతెలంగాణ-తాడ్వాయి

కాంగ్రెస్ బీసీ సెల్ మండలాధ్యక్షులు మకాయ్ బాలయ్య (53) మంగళవారం మృతి చెందినట్టు మండల కాంగ్రెస్ నాయకులు తెలిపారు. గత కొంత కాలం నుంచి అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారన్నారు. మండలంలో కాంగ్రెస్ పార్టీకి ఎనలేని సేవ చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు వెంకట్ రెడ్డి, మేకల రాజు, సంతాజి గారి సుధాకర్ రావు, రాజయ్య, పాల్గొన్నారు.

ఎన్ఆర్‌జిఎస్, ఎస్‌డిఎఫ్ నిధులు మంజూరు

- బీబీపేట్ మండలాధ్యక్షులు సుతారి రమేష్

నవతెలంగాణ-కామారెడ్డి

బీబీపేట్ మండలానికి ఎన్ఆర్‌జిఎస్, ఎస్‌డిఎఫ్ నిధులు మంజూరైనట్టు కాంగ్రెస్ పార్టీ బీబీపేట్ మండలాధ్యక్షుడు సుతారి రమేష్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. నిధుల మంజూరుకు కృషి చేసిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వెల్ఫేర్ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీకి మండల ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. (ఎన్ఆర్‌జిఎస్)లో బిబిపేట్ గ్రామపంచాయతీ భవనానికి రూ.20లక్షలు, సిసి రోడ్డు రూ.10లక్షలు, మల్కాపూర్ సిసిరోడ్డు రూ.10లక్షలు, తుజాల్పూర్ సీసీరోడ్ రూ.10లక్షలు, ఉప్పర్‌పల్లి సిసిరోడ్ రూ.10లక్షలు, జనగామ సిసిరోడ్ రూ.10లక్షలు, మాందాపూర్ సిసిరోడ్ రూ.5లక్షలు, (సీడీఎఫ్)లో డ్రైనేజ్, మల్కాపూర్ రూ.5లక్షలు, తుజాల్పూర్ రూ.5లక్షలు, ఉప్పర్‌పల్లి రూ.5లక్షలు, జనగామ రూ.10లక్షలు, గ్రామాల అభివృద్ధికై నిధులు మంజూరు చేయడం పట్ల మండల కాంగ్రెస్ పార్టీ తరపున, అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ కమిటీ తరపున షబ్బీర్ అలీకి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

తాగునీటి ఇబ్బందులు రావొద్దు

- ప్రత్యేకాధికారి రాజారాం


ఉపాధి కూలీలకు సూచనలు చేస్తున్న మండల ప్రత్యేకాధికారి

నవతెలంగాణ-తాడ్వాయి

ప్రస్తుత వేసవిలో తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడాలని మండల ప్రత్యేక అధికారి రాజారాం అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత వేసవిని దృష్టిలో పెట్టుకొని మండలంలోని ఏ గ్రామాల్లోనైనా తాగునీటి ఇబ్బందులు రావొద్దని, బోర్ మోటార్లు పైపులైన్లు చెడిపోయిన తక్షణమే మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరించాలని కార్యదర్శులకు సూచించారు. ఉపాధి కూలీల సంఖ్య పెరిగేలా చూడాల్సిన బాధ్యత ఈజీఎస్ అధికారులదేనని అన్నారు. జాబ్ కార్డులు లేని కూలీలకు అందించి ఉపాధి చూపించాలని ఆదేశించారు. అనంతరం బ్రహ్మజీవాడి నర్సరీని సందర్శించారు. నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా ఏపుగా పెరిగేందుకు అవసరమైన నీటి తడులు అందించేలా చూడాల్సిన బాధ్యత కార్యదర్శిలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, ఎంపిఓ సవితరెడ్డి, ఈజీఎస్ ఏపీవో, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బోరు మరమ్మతు పనులు

నవతెలంగాణ-తాడ్వాయి

మండల కేంద్రంలో తాగునీటి బోరు చెడిపోవడంతో మరమ్మతు పనులు మంగళవారం చేపట్టారు. సోమవారం సాయంత్రం బోరు మోటారు చెడిపోవడంతో కాలనీవాసులకు తాగునీటి ఇబ్బందులు రావద్దనే ఉద్దేశంతో మరమ్మతు పనులు చేసినట్టు కార్యదర్శి బాలయ్య తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, గంగారం, బి.స్వామి, తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి

- ఐసిటిసి కౌన్సిలర్ నాగరాజు
- హెచ్ఐవిపై అవగాహన



హెచ్ఐవీపై అవగాహన కల్పిస్తున్న కౌన్సిలర్ నాగరాజు

నవతెలంగాణ-తాడ్వాయి

పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకుని ఆరోగ్యంగా జీవించాలని ఐసిటిసి కౌన్సిలర్ నాగరాజు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో హెచ్ఐవిపై అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం వేసవిలో వడదెబ్బకు గురికాకుండా ఉండాలని, తాము సూచించిన సలహాలు పాటిస్తే ఎటువంటి సమస్యలు తలెత్తవన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే లింక్ వర్కర్లను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో పీఎం శ్రీనివాస్, ఎన్జీవో శ్రీనివాస్, సాయికిరణ్, ఎల్.సంధ్యారాణి, శంకర్, స్వరూప, ఆశాకార్యకర్తలు, కనుకంటి జ్యోతి, జి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీల స్వయం ప్రతిపత్తిని నిర్వీర్యం చేసే కుట్రలు

- రాష్ట్రాల హక్కులను కాల రాసే నిర్ణయాలు
- ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సభ్యులు రఘురాం

నవతెలంగాణ-కామారెడ్డి

యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని నిర్వీర్యం చేస్తూ తీసుకువచ్చిన యూజీసీ నూతన మార్గదర్శకాలు రాజ్యాంగ సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని వెంటనే దీనిని ఉపసంహరించుకోవాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సభ్యుడు రఘురాం అన్నారు. మంగళవారం కామారెడ్డి డిగ్రీ కాలేజ్ ముందు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సభ్యుడు రఘురాం మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వం ప్రభుత్వ విద్యా వ్యవస్థను దెబ్బతీసే విధంగా పాలన సాగిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దానిలో భాగమే విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేయాలని కుట్రలు చేస్తూ జాతీయ విద్యా విధానం పేరుతో విద్య కాషాయికరణకు పూనుకున్నారని ఆరోపించారు. సంస్కరణల పేరుతో ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందన్నారు. దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాలు, కళాశాలల ఆచార్యుల నియామకాలు, పదోన్నతి కోసం కనీస అర్హతలు, ఉన్నత విద్యలో ప్రమాణాల పరిరక్షణ పేరిట యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) జనవరి 6న ముసాయిదా డ్రాఫ్టును విడుదల చేసిందని తెలిపారు. విద్యలో కేంద్ర, రాష్ట్రాల అధికారాల విషయంలో రాజ్యాంగంలో స్పష్టంగా ఉన్నప్పటికీ దాని స్ఫూర్తికి విరుద్ధంగా ఈ ముసాయిదా ప్రతిపాదనలు ఉంటూ రాష్ట్రాల హక్కులను, నిర్ణయాధికారాన్ని బలహీన పరుస్తూ మొత్తంగా ఫెడరల్ స్ఫూర్తిని ఉల్లంఘిస్తూ రాజ్యాంగ మూల సూత్రాలకు వ్యతిరేకంగా ఉందని మండిపడ్డారు. ఇప్పటికే తమిళనాడు, కేరళ వంటి అనేక ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలలో ప్రభుత్వాలు గవర్నర్‌లతో వీసీల నియామకంపై వ్యతిరేకంగా నిర్ణయం తీసుకున్నాయని, ఆ రాష్ట్రాల మాదిరిగానే తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకొని కేంద్రంపై, యూజీసీ వత్తిడి తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో కామారెడ్డి జిల్లా కన్వీనర్ శివప్రసాద్, నాయకులు నవీన్ కృష్ణ, గణేష్, నవీన్ పవన్, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

పలువురికి ఉచిత వైద్య శిబిరం


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నవతెలంగాణ-రాజంపేట్

మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు పంచాయతీ కార్యదర్శి అశోక్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ సూరారం జీడిమెట్లకు చెందిన ఆస్పత్రి ఆధ్వర్యంలో పలువురిని పరీక్షించి ఉచితంగా మందులు అందించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమలాకర్, అనిల్, తన్మయి పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవ వేడుకలు

నవతెలంగాణ-బోధన్

పట్ట ణంలోని బస్వతారక్ నగర్‌లో గల కోట మైసమ్మ సహిత లక్ష్మీ నరసింహస్వామి ఆలయం 13వ వార్షికోత్సవ వేడుకలను మంగళవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో బాలయోగి కృష్ణ మహరాజ్ ఆధ్వర్యంలో యజ్ఞం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు పసుపులేటి గోపి కిషన్, కిషోర్, సుధాకర్, కృష్ణ, భీమ్రావు, పరమేష్, విజయ్, గోవింద్, కుమార్, లోకేష్, గౌతమ్, కప్ప లింగం, ఉదయ్, సిద్ధూ, వికాస్, సిద్దు, మారుతి, శశి, సంతు, గంగాధర్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నుంచి ఫస్ట్ ఇయర్ పరీక్షలు ప్రారంభమవుతున్నాయని ఇంటర్ అధికారులు తెలిపారు. ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. ఫస్టియర్లో తెలుగు 163 మంది, హిందీ 24 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తునట్లు తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద 144వ సెక్షన్ ఉంటుందని పేర్కొన్నారు.

పాఠశాలను పరిశీలించిన మండల ప్రత్యేక అధికారి


మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి

నవతెలంగాణ-నిజాంసాగర్

మండలంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను మండల ప్రత్యేకాధికారి శ్రీపతి మంగళవారం పరిశీలించారు. అనంతరం మండలంలోని సుల్తాన్‌నగర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లను ఆయన పరిశీలించారు. వడ్డేపల్లి గ్రామంలో ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మండలంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నర్సరీలు ఎండిపోకుండా నిరంతరం నీటిని పట్టించాలని ఆయన కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి గంగాధర్, మండల పంచాయతీ అధికారి అనిత తదితరులు పాల్గొన్నారు.

బోనాల పండుగలో పాల్గొన్న మాజీ జెడ్పిటిసి

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని ఆత్మకూరు గ్రామంలో రేణుక ఎల్లమ్మ దేవి నూతన ఆలయ నిర్మాణాన్ని చేపట్టగా.. మంగళవారం ఎల్లమ్మతల్లికి బోనాల పండగలో మాజీ జెడ్పిటిసి ఉమ్మన్నగారి మనోహర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పిటిసి మనోహర్‌రెడ్డి రేణుక ఎల్లమ్మ దేవి మాతకు ప్రత్యేక పూజలు అభిషేకాలు అర్చనలు నిర్వహించారు. ఆయన వెంట బాలా గౌడ్, రామగౌడ్, కృష్ణగౌడ్, సతీష్‌గౌడ్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మురికి కాల్వలను శుభ్రం చేయడమే లక్ష్యం

- గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగరాజు గౌడ్

నవతెలంగాణ-నిజామాబాద్

గ్రామంలో మురికి కాల్వలను శుభ్రం చేయడమే లక్ష్యమని గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగరాజు గౌడ్ అన్నారు. మంగళవారం ఎడపల్లి మండల కేంద్రంలోని నయభాది ప్రాంతంలో గల 11, 14 వార్డులలో మురికి కాలువలలో నిలిచిపోయిన చెత్తాచెదరాంతోపాటు పరిసరాలను శుభ్రం చేయించారు. చెత్తాచెదారాన్ని డంపింగ్ యార్డ్‌కు తరలించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట గ్రామపంచాయతీ కార్మికులు స్వామి తదితరులున్నారు.

స్వయంపాలన దినోత్సవం


స్వయంపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని చీనూర్ గ్రామంలో గల ఎంపీయుపిఎస్ పాఠశాలలో విద్యార్థులు మంగళవారం స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రధానోపాధ్యాయులుగా వైష్ణవి, ఉపాధ్యాయులుగా లక్ష్మి, ప్రసన్న, పావని, శిల్ప, శ్రీనిధి, శివకుమార్, విఘ్నేష్, రాజు వ్యవహరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వాసుదేవ రావు, ఉపాధ్యాయులు, గంగారాం, లావణ్య అనురాధ, ప్రసాద్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా మల్క కొమురయ్య విజయం పట్ల హర్షం


బీజేపీ నాయకుల సంబురాలు

నవతెలంగాణ-కామారెడ్డి

బీజేపీ కామారెడ్డి శాఖ ఆధ్వర్యంలో కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణారెడ్డి ఆదేశాల మేరకు ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గంలో మొదటి ప్రాధాన్యత ఓటుతోనే విజయం సాధించిన బీజేపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బీజేపీ జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో టపాకాయలు కాల్చి, మిఠాయిలు తినిపించుకుని సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు మోటూరి శ్రీకాంత్ మాట్లాడారు. ఓటమి భయంతోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా వేస్తున్నారని అన్నారు. మల్క కొమురయ్య గెలుపు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంప పెట్టు లాంటిదని అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మాత్రమే కాకుండా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా బీజేపీ బలపరిచిన అంజిరెడ్డి విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, స్టేట్ కౌన్సిల్ మెంబర్ విపుల్, అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, నాయకులు నరేందర్, రవీందర్, విజయ్, రాజు, వేణు, రఘు, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.